www.vishalabharati.com
epaper.vishalabharati.com

గురువారం, హైదరాబాద్
5 నవంబర్ 2026
సంపుటి:4 సంచిక: 299

విశాల భారతి

తెలుగు దినపత్రిక



కరువుపై కరుణేది

72 మండలాల్లో 45కే కరువు హోదా ప్రకటించారు

ఎల్‌నినో ప్రభావంతో పంటలు ఎండిపోతున్నాయి

మిగిలిన మండలాల రైతుల్లో అసంతృప్తి నెలకొంది

కరువు సాయం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు

ఎకరాకు రూ.15 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్

అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని విజ్ఞప్తి

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రైతుల పరిస్థితి రోజురోజుకూ అందోళనకరంగా మారుతోంది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గిపోవడం, భూగర్భ జలాలు పడిపోవడం, సాగునీరు అందక పంటలు ఎండిపోవడం అన్నదాతలను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితా కొత్త వివాదానికి దారి తీసింది. రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల్లోని 365 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించారు. వీటిలో 111 మండలాలకు తీవ్ర కరువు, 254 మండలాలకు మధ్యస్థ కరువు హోదా ఇచ్చారు. అయితే ఉమ్మడి ఆదిలాబాద్ పరిధిలోని 72 మండలాల్లో కేవలం 45 మండలాలకే చోటు దక్కింది.

మిగతా 3లో..

ఖమ్మం బాండ్ల బాగోతం

- రూ.100 బాండ్ పేపర్ రూ.150 నుంచి రూ.200కు విక్రయం
- కృత్రిమ కొరత సృష్టించి ప్రజల నుంచి అదనపు వసూళ్లు
- వెండర్లు, దళారుల సిండికేట్‌తో అక్రమ వ్యాపారం
- ఫిర్యాదు చేస్తే లైసెన్స్ రద్దు చేస్తామన్న రిజిస్ట్రార్
- బాండ్ పేపర్ల కొరత లేదని అధికారుల స్పష్టీకరణ

ఖమ్మం జిల్లాలో స్టాంప్ పేపర్ల అధిక ధరల దందా



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సామాన్య ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని మరో అక్రమ దందా తెరపైకి వచ్చింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్ణయించిన ధరలకు విక్రయించాల్సిన నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లు ఇప్పుడు కొందరు వెండర్లు, దళారుల చేతుల్లో అధిక ధరలకు అమ్ముడవుతున్నాయనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ముఖ్యంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు, తహసీల్దార్ ఆఫీసులు, కోర్టుల పరిసరాల్లో ఈ వ్యవహారం జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. రూ.100 విలువ కలిగిన బాండ్ పేపర్‌ను

మిగతా 3లో..

మరో నాలుగు నగరాల్లో ఇందిరమ్మ టవర్లు



- రాష్ట్రంలోని నాలుగు కార్పొరేషన్లలో ఇందిరమ్మ టవర్ల నిర్మాణం
- ఇప్పటివరకు 2,21,500 ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తి
- తొలి విడతలో 4.50 లక్షల ఇళ్లకు ప్రభుత్వం మంజూరు
- మరో 1.90 లక్షల ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి
- రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లకు అనుమతులు ఇచ్చారు
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.40 వేల కోట్ల వ్యయం

విశాలభారతి, స్టేట్ బ్యూరో: తెలంగాణలో పేదలకు సొంతింటి కలను నిజం చేసే దిశగా ఇందిరమ్మ ఇళ్ల పథకం కీలక అడుగులు వేస్తోంది. ఇప్పటికే లక్షలాది కుటుంబాలు కొత్త ఇళ్లలో గృహప్రవేశాలు చేసుకోగా, మరికొన్ని లక్షల ఇళ్ల నిర్మాణం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని నాలుగు ప్రధాన కార్పొరేషన్లలో హైదరాబాద్ తరహాలో ఇందిరమ్మ టవర్స్

మిగతా 3లో..



ఆరు నెలలైనా అందలే..!

అక్టోబర్ 30 నాటికి 49.63 లక్షల జతల పంపిణీ పూర్తి

మరో 1.60 లక్షల యూనిఫామ్స్ కుట్టు పనులు ప్రారంభం కాలేదు

పాఠశాల విద్యాశాఖలోనే 1.08 లక్షల జతలు పెండింగ్‌లో ఉన్నాయి

సీఎం పరిధిలోని విద్యాశాఖలోనూ పంపిణీ నత్తనడకన సాగుతోంది

ఆరు నెలలైనా విద్యార్థులకు అందని 3.67 లక్షల యూనిఫామ్స్

రాష్ట్రవ్యాప్తంగా 53.30 లక్షల జతలు పంపిణీ చేయాల్సి ఉంది

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, సంక్షేమ విద్యాసంస్థల్లో చదువుతున్న 26 లక్షల 65 వేల మంది విద్యార్థులకు మొత్తం 53 లక్షల 30 వేల యూనిఫామ్‌లు పంపిణీ చేయాల్సి ఉంది. అయితే అక్టోబర్ 30 నాటికి అందించినవి కేవలం 49 లక్షల 63 వేల యూనిఫామ్‌లు మాత్రమే. అంటే ఇంకా 3 లక్షల 67 వేలకుపైగా

మిగతా 3లో..

తెలంగాణలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తామని, పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి సదుపాయాలు కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం పదేపదే చెబుతోంది. ప్రభుత్వ, సంక్షేమ గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను తమ సొంత పిల్లలుగా భావించి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని మంత్రులు ప్రకటనలు చేస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం ప్రభుత్వ హామీలకు పూర్తి భిన్నంగా కనిపిస్తున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభమై దాదాపు ఆరు నెలలు గడిచిపోయినా విద్యార్థులకు అందాల్సిన ఉచిత యూనిఫామ్‌ల పంపిణీ ఇంకా పూర్తికాలేదు. ప్రతి విద్యార్థికి ఏడాదికి రెండు జతల చొప్పున దుస్తులు అందించాలనే లక్ష్యం పెట్టుకున్న ప్రభుత్వం, ఆ లక్ష్యాన్ని చేరుకోవడంలో మాత్రం వెనుకబడిపోయింది. స్కూల్ ప్రారంభమైన సమయంలోనే విద్యార్థులకు అందాల్సిన యూనిఫామ్‌లు అర్ధ విద్యా సంవత్సరం గడిచినా అందకపోవడం ప్రభుత్వ విద్యాశాఖ పనితీరుపై విమర్శలకు కారణమవుతోంది.



ఉప్పొంగిన బేతుపల్లి చెరువు

- రెస్క్యూ బోట్లు బోల్తా.. 10 మంది గల్లంతు
- ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది కోసం ముమ్మర గాలింపు
- సత్తుపల్లిలో భారీ వర్షా లు, వరదల బీభత్సం
- ఏడుగురు మత్స్యకారుల్లో నలుగురి రక్షణ
- ప్రమాద స్థలంలో కలెక్టర్, ఎమ్మెల్యే పర్యవేక్షణ
- వరదలతో జాతీయ రహదారిపై రాకపోకలు నిలిపివేత

02



కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నింపిన 'రంగన్న ఆత్మీయ సమ్మేళనం

- సమ్మేళనానికి హాజరైన భువనగిరి ఎంపీ చామల కిరణ్
- కార్యకర్తలకు భరోసానిచ్చిన ఎంపీ చామల, ఎమ్మెల్యే మల్‌రెడ్డి
- పలుఅంశాలను నేతల ముందు ప్రస్తావించిన మండలస్థాయి నేతలు
- ముఖ్యమంత్రితో ప్రత్యేకంగా చర్చిస్తామని చెప్పిన ఎంపీ, ఎమ్మెల్యే

06

హైదరాబాద్ అభివృద్ధి చేసింది యాదవులే..!



- సదర్ సమ్మేళనానికి రాష్ట్ర పండుగ హోదా కల్పించాం: సీఎం
- యాదవుల ఆత్మగౌరవానికి భంగం కలగకుండా చూస్తాం: హామీ
- సమ్మేళనం నిర్వహణకు ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు
- మూసీ, మెట్రో, ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి సహకరించాలి
- యాదవులకు రాజకీయంగా సముచిత ప్రాధాన్యం కల్పించాం
- భవిష్యత్తులోనూ యాదవులకు తగిన వాటా దక్కేలా చర్యలు

02

భూములు అమ్ముకునే బ్రోకర్ రేవంత్



- రేవంత్‌రెడ్డిని భూముల బ్రోకర్ అంటూ కేటీఆర్ విమర్శలు
- ఎన్నికల్లో భట్టి విక్రమార్క నటించారని ఎద్దేవా
- మియాపూర్ 550 ఎకరాల భూమిపై సీఎం వ్యాఖ్యలను తప్పబట్టారు
- హిల్ట్ పాలసీతో 10 వేల ఎకరాల అమ్మకానికి కుట్ర చేస్తున్నారని ఆరోపణ
- హిల్ట్ భూములు కొంటే ఇబ్బందులు తప్పవని పారిశ్రామికవేత్తలకు హెచ్చరిక
- ఏడాదిలో కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారని కేటీఆర్ ధీమా వ్యక్తం

02



ఇద్దరి మహిళల దారుణ హత్య

- మీర్‌పేట్‌లో ఇద్దరు మహిళల దారుణ హత్య
- అత్త, బావమరిది భార్యను చంపిన అల్లుడు సిద్ధిక్
- కుటుంబ కలహాలే హత్యలకు కారణమని ప్రాథమిక సమాచారం
- ప్రాణహాని ఉందంటూ ఉదయమే పోలీసులను ఆశ్రయించిన కుటుంబం
- హత్యల అనంతరం పరారైన నిందితుడు సిద్ధిక్
- కేసు నమోదు చేసి నిందితుడి కోసం పోలీసుల గాలింపు

03

ట్విట్టర్ టిల్లుది మేనేజ్‌మెంట్ కోటా..!

- కేటీఆర్ వ్యాఖ్యలకు బండి సంజయ్ ఘాటు కౌంటర్
- మేనేజ్‌మెంట్ కోటా కాదు.. మెరిట్ కోటా అంటూ ఫైర్
- కేటీఆర్‌ను ట్విట్టర్ టిల్లుగా అభివర్ణించిన సంజయ్
- మియాపూర్ భూములపై కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు చురకలు
- కండక్టర్ ప్రవళిక మృతిపై బండి సంజయ్ తీవ్ర ఆవేదన
- ఆర్టీసీ కార్మికుల పట్ల మానవత్వం చూపాలని విజ్ఞప్తి



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది. హైదరాబాద్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటన సందర్భంగా బండి సంజయ్ వ్యవహరించిన తీరుపై కేటీఆర్ చేసిన బౌన్సర్ వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. దీనిపై బండి సంజయ్ తనదైన శైలిలో గట్టి కౌంటర్ ఇచ్చారు. కేటీఆర్‌ను ట్విట్టర్ టిల్లు అంటూ ఎద్దేవా చేశారు. తండ్రి రాజకీయ వారసత్వంతో పదవులు పొందడం మేనేజ్‌మెంట్ కోటా అయితే, ప్రజల కోసం పోరాడి లాఠీదెబ్బలు తిని ఎదగడం మెరిట్ కోటా అని వ్యాఖ్యానించారు. కేటీఆర్ రాజకీయ ప్రయాణాన్ని తన అనుభవంతో పోలుస్తూ విమర్శలు గుప్పించారు. ప్రజాక్షేత్రంలో పోరాటాలు చేసి

మిగతా 2లో..

గడ్డిఅన్నారం మార్కెట్‌కు పీఐసీని నియమించాలి

- **45 రోజులు గడిచినా నియామకం ఏదీ?**
- **మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌కు మాజీ చైర్మన్ రామ్ నరసింహ గౌడ్ వినతి**

విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :

గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీకి వెంటనే ప్రత్యేక అధికారిని (పీఐసీ) నియమించాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డాక్టర్ వీరమల్ల రామ్ నరసింహ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ రాహుల్ రాజ్ ఐఏఎస్‌ను సచివాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. మార్కెట్ కమిటీ పాలకవర్గం పదవీకాలం ముగిసి 45 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం ఇప్పటివరకు ప్రత్యేక అధికారిని నియమించక పోవడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై గతంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన రాలేదని తెలిపారు. పీఐసీ నియామకంలో జాప్యం వల్ల మార్కెట్ కమిటీ పరిపాలన, రైతులకు అందించాల్సిన సేవలు, సిబ్బంది జీతభత్యాలు, పెండింగ్ పనులకు ఆటంకాలు కలగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీకి ప్రత్యేక అధికారిని నియమించే ప్రక్రియను వేగవంతం చేయాలని డాక్టర్ రామ్ నరసింహ గౌడ్ కోరారు.



హైదరాబాద్ అభివృద్ధి చేసింది యాదవులే..!

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియం వేదికగా జరిగిన శ్రీకృష్ణ సదర్ సమ్మేళనంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. యాదవుల చిరకాల కోరికను నెరవేరుస్తూ సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించామని గుర్తుచేశారు. ఇది కేవలం ఒక సామాజికవర్గానికి సంబంధించిన వేడుక మాత్రమే కాదని, తెలంగాణ ప్రజలందరి ఆత్మగౌరవానికి ప్రతీక అని అభివర్ణించారు. యాదవ సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపిన సీఎం, వారి గౌరవానికి ఎలాంటి లోటు రాకుండా చూసే బాధ్యత తమ ప్రభుత్వానిదని స్పష్టం చేశారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా సదర్ సమ్మేళనానికి రాష్ట్ర పండుగ హోదా కల్పించే ఆలోచన చేయలేదని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం మాత్రం యాదవుల అభ్యర్థనను గౌరవించి నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ ప్రకటనతో సంప్రదాయ పండుగకు ప్రభుత్వ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించిందని చెప్పారు. తెలంగాణ సంస్కృతిలో భాగమైన ఇలాంటి వేడుకలను ప్రోత్సహించడం ద్వారా సామాజిక ఐక్యతను మరింత బలోపేతం చేయవచ్చని అభిప్రాయపడ్డారు. సదర్ సమ్మేళనం సందర్భంగా హైదరాబాద్ అభివృద్ధిలో యాదవ సమాజం పోషించిన పాత్రను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావించారు. నగర చరిత్రలో గోల్కొండ కోటకు ప్రత్యేక స్థానం ఉందని, ఒకప్పుడు దీనిని గొల్లంకొండగా పిలిచేవారని చెప్పారు. హైదరాబాద్ అభివృద్ధి చెందడంలో యాదవ సోదరుల సహకారం ఎంతో ఉందని కొనియాడారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఉపాధి, వ్యాపార అవకాశాల కోసం నగరానికి వచ్చిన ప్రజలను స్థానిక యాదవ సమాజం ఆదరించిందని పేర్కొన్నారు. అందరినీ కలుపుకొని ముందుకు వెళ్లే సంస్కృతి హైదరాబాద్ ప్రత్యేకత అని వివరించారు. నగర ఎదుగుదలలో వివిధ వర్గాల కృషిని గుర్తించాల్సిన అవసరం ఉందని తెలిపారు. యాదవుల ఆత్మగౌరవాన్ని కాపాడటంతో పాటు వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని హామీ ఇచ్చారు. సంప్రదాయాలను గౌరవిస్తూనే ఆధునిక అభివృద్ధిలో ప్రతి వర్గానికీ



అవకాశాలు కల్పించాలన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. తెలంగాణను దేశంలో అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ముఖ్యంగా హైదరాబాద్ భవిష్యత్తును మార్చే మూడు కీలక ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. మూసీ అభివృద్ధి, మెట్రో రైలు విస్తరణ, భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు నగర మౌలిక వసతులను మెరుగుపరచడంతోపాటు కొత్త పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలకు దారితీసే అవకాశం ఉంది. అయితే భారీ అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం కావాలంటే ప్రజల సహకారం అవసరమని సీఎం అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా యాదవ సోదరులు ప్రభుత్వ కార్యక్రమాలకు అండగా నిలవాలని కోరారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడే నగరంగా అభివృద్ధి చేయాలనే సంకల్పాన్ని వ్యక్తం చేశారు. నగర విస్తరణతోపాటు అన్ని సామాజికవర్గాల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు చేపడతామని తెలిపారు. అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరాలన్నదే తమ ఉద్దేశమని వివరించారు. తెలంగాణలో సామాజిక న్యాయానికి తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా కులగణన నిర్వహించామని గుర్తుచేశారు. దేశంలోని ఇతర రాష్ట్రాలు కూడా తెలంగాణ విధానాన్ని అనుసరించే స్థాయిలో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. సామాజికవర్గాల జనాభా, వారి అవసరాలను గుర్తించి ప్రభుత్వ పథకాలు రూపొందించేందుకు కులగణన ఉపయోగపడుతుందని వివరించారు. ముఖ్యంగా యాదవులకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. అనిల్ కుమార్ యాదవ్‌కు రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించామని, నవీన్ యాదవ్‌ను ఎమ్మెల్యేగా ప్రోత్సహించామని పేర్కొన్నారు. అలాగే ఈశ్వరమ్మ యాదవ్‌ను యాదగిరిగుట్ట బోర్డు సభ్యురాలిగా నియమించామని తెలిపారు. కేవలం పదవులు ఇవ్వడమే కాకుండా సామాజికంగా, ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశాలు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. భవిష్యత్తులో యాదవులకు దక్కాల్సిన వాటా అందేలా చర్యలు కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. సదర్ సమ్మేళనాన్ని మరింత ఘనంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. రాష్ట్ర పండుగగా గుర్తింపు ఇచ్చిన తర్వాత నిర్వహణకు అవసరమైన సహకారం అందించడం కూడా ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. మరోవైపు యాదగిరిగుట్టలో గోసంరక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటించారు. యాదగిరిగుట్ట గోశాలలో పశువుల సంరక్షణకు అవసరమైన వసతులు అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. యాదవ సమాజానికి పశుపోషణతో ఉన్న చారిత్రక అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. వారి సంప్రదాయ వృత్తులు, సాంస్కృతిక గుర్తింపును కాపాడేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. సదర్ సమ్మేళనానికి రాష్ట్ర పండుగ హోదా ఇవ్వడం సాంస్కృతికంగా కీలక నిర్ణయంగా నిలిచింది. అదే సమయంలో రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం, అభివృద్ధి కార్యక్రమాల్లో యాదవుల భాగస్వామ్యాన్ని పెంచుతామని సీఎం ప్రకటించారు. తెలంగాణ అభివృద్ధిలో ప్రతి సామాజికవర్గం భాగస్వామి కావాలనే సందేశంతో ఆయన ప్రసంగం సాగింది.



ప్రైవేట్ ట్యాంకర్లను అడ్డుకుంటారు.. మున్సిపల్ నీళ్లు సరఫరా చేయరు

- **హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ అధికారులకు బీఆర్ఎస్ నాయకుల వినతి**

రాజేంద్రనగర్, విశాల భారతి :

ఒకవైపు ప్రైవేట్ నీటి ట్యాంకర్లను కాలనీల్లోకి రానివ్వకుండా అడ్డుకుంటుండగా, మరోవైపు మున్సిపల్ అధికారులు సక్రమంగా తాగునీటిని సరఫరా చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ బండ్లగూడ రాజేంద్రనగర్ సర్కిల్ అధ్యక్షుడు రావులకోళ్ళ నాగరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. నీటి సమస్యతో సతమతమవుతున్న సంజయ్ గాంధీ నగర్, యాదయ్య నగర్, సాయి బాలాజీ నగర్, కేకే నగర్, భవానీ నగర్, హిమగిరి నగర్, శాంతి నగర్ కాలనీల ప్రజల తరపున ఆయన హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజ్ మాట్లాడుతూ.. ఏడు కాలనీల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసుకుందామన్నా వాటిని కాలనీల్లోకి అనుమతించడం లేదని, మరోవైపు ప్రభుత్వ నీటి సరఫరా కూడా సక్రమంగా జరగడం లేదని పేర్కొన్నారు. దీంతో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు కనీస అవసరమైన తాగునీటిని అందించడం అధికారుల బాధ్యత అని, నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి ఉండకూడదని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఏడు కాలనీలకు నిరంతరాయంగా, సక్రమంగా మున్సిపల్ తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు.

భూములు అమ్ముకునే బ్రోకర్

రేవంత్ రెడ్డి

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి ఘాటు వ్యాఖ్యలతో దుమారం రేపారు. శేరిలింగంపల్లి నుంచి పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. భూముల వ్యాపారం చేసే వ్యక్తిని ప్రజలు ముఖ్యమంత్రిని చేశారంటూ ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను ప్రస్తావిస్తూ ప్రజలను ఆకట్టుకునేందుకు అనేక కథలు చెప్పారని విమర్శించారు. ముఖ్యంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎన్నికల ప్రచారంలో సినీ నటులు కమల్ హాసన్, రజనీకాంత్‌ను మించి నటించారని సెటైర్లు వేశారు. ఇంటింటికీ గ్యారెంటీ కార్డులు పంపిణీ చేసినప్పటికీ హైదరాబాద్ ప్రజలు బీఆర్ఎస్‌కే మద్దతిచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత హామీల అమలు కంటే వివాదాస్పద నిర్ణయాలకే ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. దీంతో రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయ విమర్శలు మరింత వేడెక్కాయి. హైదరాబాద్‌లో భూముల వ్యవహారాన్ని కేటీఆర్ ప్రధానంగా ప్రస్తావించారు. మియాపూర్‌లోని 550 ఎకరాల భూమికి సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన తర్వాత ఆ భూములను విక్రయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ప్రభుత్వ భూములను అమ్మడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవడంపైనే కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి పెట్టిందని ఆరోపించారు. మరోవైపు హైడ్రా చర్యలపైనా విమర్శలు గుప్పించారు. చెరువులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ పేరుతో చేపట్టిన చర్యల వల్ల భూముల విలువలు తగ్గిపోయాయని పేర్కొన్నారు. అయితే రేవంత్ రెడ్డి సోదరుడు, మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి చెరువుల శిఖం ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించుకోవచ్చా అంటూ ప్రశ్నించారు. సామాన్యుల విషయంలో ఒకలా, అధికారానికి దగ్గరగా ఉన్నవారి విషయంలో మరోలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. హైడ్రా వల్ల నిజంగా ఎవరికి ప్రయోజనం కలిగిందనే అంశాన్ని ప్రజల ముందుంచారు. హిల్ట్ పాలసీ పేరుతో తెలంగాణ ప్రభుత్వం భారీ భూ విక్రయాలకు సిద్ధమవుతోందని కేటీఆర్ ఆరోపించారు. ఈ విధానం ద్వారా దాదాపు పది వేల ఎకరాల భూములను అమ్మేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ముఖ్యంగా పారిశ్రామికవేత్తలు ఈ పాలసీ కింద భూములు కొనుగోలు చేసే ముందు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. భవిష్యత్తులో రాజకీయ పరిస్థితులు మారితే అలాంటి లావాదేవీలపై ప్రభావం పడవచ్చని పేర్కొన్నారు. ఏడాదిలోగా కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే హిల్ట్ పాలసీ ద్వారా జరిగే భూ వ్యవహారాలకు అడ్డుకట్ట వేస్తామని ప్రకటించారు. మరోవైపు హౌసింగ్ బోర్డు భూములు, వక్ఫ్ ఆస్తులను కూడా ప్రభుత్వం విక్రయిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ ఆస్తులను



కాపాడాల్సిన బాధ్యతను విస్మరించి అమ్మకాలపై దృష్టి పెట్టడం సరైన విధానం కాదని విమర్శించారు. ఈ వ్యాఖ్యలతో హిల్ట్ పాలసీ తెలంగాణ రాజకీయాల్లో మరో వివాదాస్పద అంశంగా మారింది. తెలంగాణ అమరవీరుల కుటుంబాల అంశాన్ని కూడా కేటీఆర్ తన ప్రసంగంలో ప్రస్తావించారు. ఎర్రవెల్లిలో అమరవీరులకు ఇళ్లు నిర్మిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్నారని గుర్తుచేశారు. నిజంగా అమరవీరుల కుటుంబాలపై గౌరవం ఉంటే హైదరాబాద్‌లోని మియాపూర్ ప్రాంతంలోనే వారికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. విలువైన భూములను విక్రయించే బదులు తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసినవారి కుటుంబాలకు ఉపయోగపడేలా వినియోగించాలని సూచించారు. భూముల అమ్మకాలపై ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు భవిష్యత్తులో రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలిగించే అవకాశముందని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి పేరుతో ప్రభుత్వ ఆస్తులను విక్రయిస్తున్నారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు, పేదలకు గృహవసతి, సామాజిక సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. హైదరాబాద్ భూములపై జరుగుతున్న రాజకీయ చర్చలో అమరవీరుల కుటుంబాల అంశాన్ని తీసుకురావడం ద్వారా ప్రభుత్వ నిర్ణయాలను కేటీఆర్ మరింత గట్టిగా ప్రశ్నించారు. కాంగ్రెస్‌తోపాటు బీజేపీ నాయకత్వంపైనా కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యవహారశైలితో కరీంనగర్ ప్రతిష్ఠ దెబ్బతింటోందని వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి హోదాకు తగినట్లు ఆయన వ్యవహరించడం లేదని విమర్శించారు. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ భద్రతా సిబ్బంది పక్కకు తోసివేశారని ప్రస్తావించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాదాలకు నమస్కరించారని ఎద్దేవా చేశారు. అమిత్ షా తెలంగాణకు వచ్చి ప్రజలకు చేతులు ఊపడం తప్ప రాష్ట్రానికి ప్రత్యేకంగా చేసిందేమీ లేదని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ రెండూ ఢిల్లీ నాయకత్వం చుట్టూనే తిరుగుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్‌ను ఢిల్లీకి సంచులు మోసే పార్టీగా, బీజేపీని చెప్పులు మోసే పార్టీగా అభివర్ణించారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడేది ప్రాంతీయ నాయకత్వమేనని చెప్పే ప్రయత్నం చేశారు. ఈ వ్యాఖ్యలతో మూడు ప్రధాన పార్టీల మధ్య రాజకీయ పోరు మరింత ఉత్కంఠగా మారింది.

రీసైక్లింగ్‌పై నిర్లక్ష్యపు నీడ

సిటీబ్యూరో

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే నిర్మాణ వ్యర్థాలనే సంపదగా మార్చి హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరం వైపు పరుగులు పెట్టించగా.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సీ అండ్ డీ (కన్‌స్ట్రక్షన్స్ అండ్ డీమాలిషన్) ప్లాంట్ల నిర్వహణతో పాటు వ్యర్థాల సేకరణలో విఫలమైంది. తద్వారా ట్రై కార్పొరేషన్ పరిధిలో ఎక్కడా చూసినా గుట్ట గుట్టలుగా పేరుకుపోయిన వ్యర్థాల డంపింగ్ యార్డులు దర్శనమిస్తున్నాయి. రోజురోజుకూ పెరిగిపోతున్న నిర్మాణ, కూల్చివేత వ్యర్థాల (సీఅండ్ డీ) సమస్యకు శాశ్వత పరిష్కారంగా చేపట్టిన రీసైక్లింగ్ ప్రక్రియ అధికారుల తాత్సారంతో ఇప్పుడు మరో తీవ్ర సంక్షోభంలో పడింది. కొన్ని ప్లాంట్లలో వ్యర్థాలను శుద్ధి చేసి ఇటుకలు, రోబోశాండ్ , పేవర్ బ్లాకులు, టైల్స్ , కెర్బ్ స్టోన్స్ వంటి నాణ్యమైన ఉత్పత్తులు తయారు చేస్తున్నప్పటికీ.. వాటి ధరలను ఖరారు చేయడంలో ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ) అధికారుల కమిటీ జాప్యం చేస్తుండటం గమనార్హం. ఒకవైపు రీసైకిల్ చేసిన ఉత్పత్తులను తప్పనిసరిగా వాడాలని ఆదేశాలు ఉన్నా.. మరోవైపు ధరలు నిర్ణయించకపోవడం పాలనా యంత్రాంగం వైఫల్యానికి అద్దం పడుతోంది. సీఅండ్‌డీ వ్యర్థాల నిర్వహణను పటిష్టం చేస్తూ, రీసైకిల్ ఉత్పత్తుల వినియోగాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది జూన్ 19న జీఓ నంబర్ 626 జారీ చేసింది. కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలోని జీహెచ్ ఎంసీ, సైబరాబాద్ , మలాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్లలో ఈ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేసింది.

ట్విట్టర్ టిల్లుది మేనేజ్‌మెంట్ కోటా..!

మొదటిపేజీ తరువాయి

నాయకుడిగా ఎదిగానని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలతో రెండు పార్టీల మధ్య రాజకీయ విమర్శలు మరింత వేడెక్కాయి. అమిత్ షా హైదరాబాద్ పర్యటన సమయంలో జరిగిన పరిణామాలపై బండి సంజయ్ ప్రత్యేకంగా స్పందించారు. కేంద్ర హోంమంత్రి పాల్గొన్న పాదయాత్రకు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చారని గుర్తుచేశారు. ఆ సమయంలో తోపులాట జరగకుండా జనాన్ని నియంత్రించేందుకు ప్రయత్నించానని వివరించారు. ప్రజల భద్రత కోసం చేసిన పనిని బౌన్సర్ వ్యవహారంగా చూపించడం కేటీఆర్ రాజకీయ విమర్శల్లో భాగమని మండిపడ్డారు. కేంద్ర మంత్రి హోదాలో ఉంటూ కరీంనగర్ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు. మరోవైపు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు సొంత కార్యకర్తలను పట్టించుకోలేదని ఆరోపించారు. అవసరమైన సందర్భాల్లో వారిపైనే బౌన్సర్లను ప్రయోగించిన సంస్కృతి ఆ పార్టీకే ఉందని విమర్శించారు. పదేళ్ల పాలనలో కార్యకర్తలను నిర్లక్ష్యం చేసిన నాయకులు ఇప్పుడు ప్రజల భద్రత గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. దీంతో అమిత్ షా పర్యటనలో జరిగిన చిన్న ఘటన రాజకీయంగా పెద్ద వివాదంగా మారింది. కేటీఆర్‌పై విమర్శలతో ఆగకుండా తెలంగాణలో భూముల వ్యవహారాన్ని కూడా బండి సంజయ్ తెరపైకి తీసుకొచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విలువైన ప్రభుత్వ భూములను తక్కువ ధరలకు విక్రయించారని ఆరోపించారు. రాష్ట్ర సంపదను కాపాడాల్సిన కేసీఆర్ కుటుంబం భూముల అమ్మకాల ద్వారా ప్రయోజనం పొందిందని విమర్శించారు. ప్రస్తుతం



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే విధానాన్ని కొనసాగిస్తోందని మండిపడ్డారు. ముఖ్యంగా హైదరాబాద్ మియాపూర్ ప్రాంతంలోని విలువైన భూముల విక్రయాలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలును పక్కనపెట్టి భూములు అమ్మేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఆ భూముల విక్రయాల ద్వారా వచ్చే డబ్బును ఢిల్లీ కాంగ్రెస్ అధిష్ఠానానికి పంపించేందుకే ఈ నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు. దీంతో భూముల అంశంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలను బండి సంజయ్ ఒకేసారి టార్గెట్ చేశారు. రాజకీయ విమర్శల మధ్య ఆర్టీసీ మహిళా కండక్టర్ ప్రవళిక మృతి ఘటనపైనా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పందించారు. ఇటీవల బస్సులో జరిగిన తోపులాట ఘటనలో ప్రవళిక ప్రాణాలు కోల్పోవడం తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా రవాణా వ్యవస్థలో పనిచేసే సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రభుత్వ విధానాలు, ప్రయాణ సౌకర్యాలపై ఉన్న అసంతృప్తిని ఆర్టీసీ ఉద్యోగులపై చూపించడం సరైన పద్ధతి కాదని ప్రయాణికులకు సూచించారు. ప్రతిరోజు దాదాపు కోటి మందిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు కార్మికులు ఎంతో ఓపికతో పనిచేస్తున్నారని గుర్తుచేశారు. రిటైర్మెంట్ తర్వాత సరైన పెన్షన్ సౌకర్యాలు లేకపోయినా సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఒత్తిళ్లను అర్థం చేసుకోవాలని కోరారు. ఆర్టీసీ కార్మికులతో ప్రయాణికులు గౌరవంగా, మానవత్వంతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. మొత్తానికి అమిత్ షా పర్యటనలో జరిగిన జనసమూహ నియంత్రణ వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో కొత్త వివాదానికి కారణమైంది. బండి సంజయ్‌ను బౌన్సర్‌తో పోల్చిన కేటీఆర్ వ్యాఖ్యలకు కేంద్ర మంత్రి మరింత ఘాటుగా స్పందించారు. ఒకవైపు రాజకీయ వారసత్వం, మరోవైపు ప్రజాపోరాటాల ద్వారా ఎదిగిన నాయకత్వం అనే అంశాలను తెరపైకి తీసుకొచ్చారు. ఇదే సమయంలో మియాపూర్ భూముల విక్రయాలు, కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు, గత బీఆర్ఎస్ పాలనపై విమర్శలు చేస్తూ చర్చను విస్తరించారు. దీంతో రాజకీయ వివాదం కేవలం ఇద్దరు నాయకుల వ్యక్తిగత వ్యాఖ్యలకే పరిమితం కాలేదు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, ప్రజా సమస్యలు కూడా ఇందులో భాగమయ్యాయి. మరోవైపు ప్రవళిక మృతి నేపథ్యంలో ఆర్టీసీ ఉద్యోగుల భద్రతను ప్రస్తావించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పరిణామాలతో తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య రాజకీయ విమర్శలు మరోసారి జోరందుకున్నాయి.

ఉప్పొంగిన బేతుపల్లి చెరువు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:


ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలంలో ప్రకృతి ప్రకోపం తీవ్ర విషాదాన్ని నింపింది. భారీ వర్షాలు, వరదలతో జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తమైంది. బేతుపల్లి చెరువు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో అక్కడ చిక్కుకుపోయిన మత్స్యకారులను రక్షించేందుకు చేపట్టిన సహాయక చర్యలు మరో పెను ప్రమాదానికి దారితీశాయి. ఏడుగురు మత్స్యకారులు వరదలో చిక్కుకుపోవడంతో వారిని సురక్షితంగా బయటకు తీసుకురావడానికి అధికారులు రంగంలోకి దిగారు. మొదట నలుగురు మత్స్యకారులను రక్షించడంలో రెస్క్యూ బృందాలు విజయం సాధించాయి. మిగిలిన ముగ్గురిని కూడా కాపాడేందుకు ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది తమ ప్రాణాలను పణంగా పెట్టి రంగంలోకి దిగారు. అయితే, అప్పటికే చెరువులో నీటి ప్రవాహం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరుకుంది. పరిస్థితులు క్షణక్షణానికి మారిపోతుండటంతో సహాయక చర్యలు క్లిష్టంగా మారాయి. సాధారణంగా ప్రజలను రక్షించేందుకు వెళ్లే రెస్క్యూ సిబ్బందే ఇప్పుడు ప్రాణాపాయ పరిస్థితుల్లో చిక్కుకోవడం ఈ ఘటనలో అత్యంత కలచివేసే అంశంగా మారింది. మత్స్యకారులను రక్షించే క్రమంలో ఊహించని ప్రమాదం చోటుచేసుకుంది. వరద ప్రవాహం తీవ్రతకు ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది ప్రయాణిస్తున్న రెండు రెస్క్యూ బోట్లు ప్రమాదవశాత్తు బోల్తా పడ్డాయి. దీంతో పది మంది ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది వరద నీటిలో కొట్టుకుపోయి గల్లంతయ్యారు. అప్పటివరకు ముగ్గురు మత్స్యకారులను కాపాడేందు



కు కొనసాగుతున్న ఆపరేషన్ ఒక్కసారిగా మరో భారీ రెస్క్యూ ఆపరేషన్‌గా మారిపోయింది. నీటి ప్రవాహం అదుపు తప్పడం, వరద ఉద్ధృతి ఎక్కువగా ఉండటంతో గల్లంతైన సిబ్బంది ఆచూకీ గుర్తించడం అత్యంత కష్టతరంగా మారింది. అయినప్పటికీ సహాయక బృందాలు వెనక్కి తగ్గకుండా గాలింపు చర్యలను కొనసాగిస్తున్నాయి. మరో బోటు సాయంతో వరద నీటిలో గల్లంతైన ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. ఈ ఘటనలో సహాయక చర్యలకు వెళ్లిన సిబ్బంది భద్రత ఎంత కీలకమో మరోసారి స్పష్టమైంది. ప్రమాదకరమైన వరద ప్రాంతాల్లో రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహించడం ఎంతటి సవాలుతో కూడుకున్నదో ఈ సంఘటన తెలియజేస్తోంది. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, జిల్లా కలెక్టర్ దివాకర్ వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. అక్కడ కొనసాగుతున్న సహాయక చర్యలను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. గల్లంతైన సిబ్బంది ఆచూకీ కనుగొనడం, వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించడం అధికారులకు అత్యంత ప్రాధాన్యంగా మారింది. మరోవైపు సత్తుపల్లి పట్టణం చుట్టూ వరద నీరు భారీగా చేరడంతో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. తమ్మిలేరు వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తూ ప్రమాదకర స్థాయికి చేరుకుంది. వాగు ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో సమీప ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షాలు కురిసినప్పుడు సాధారణంగా కనిపించే వాగులు, చెరువులు ఒక్కసారిగా ఉగ్రరూపం దాల్చడం గ్రామీణ ప్రాంతాల్లో ఎంతటి ప్రమాదాన్ని సృష్టిస్తుందో ఈ ఘటన మరోసారి చాటిచెబుతోంది. అధికారులు సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నప్పటికీ, వరద ఉద్ధృతి కారణంగా ప్రతి అడుగు అత్యంత జాగ్రత్తగా వేయాల్సిన పరిస్థితి నెలకొంది. సత్తుపల్లి పరిసర ప్రాంతాల్లో వరదల ప్రభావం రవాణా వ్యవస్థపైనా తీవ్రంగా పడింది. తమ్మిలేరు వాగు ఉద్ధృతి, పట్టణం చుట్టూ వరద నీరు చేరడంతో ముందస్తు జాగ్రత్త చర్యగా పోలీసులు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. దీంతో రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర పనులపై వెళ్లేవారు, దూర ప్రాంతాల నుంచి ప్రయాణిస్తున్న వాహనదారులు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. వరద నీరు రహదారులపైకి చేరినప్పుడు వాహనాలను ముందుకు నడిపించడం ప్రాణాలకు ముప్పుగా మారే అవకాశం ఉండటంతో పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. నీటి ప్రవాహం గంటగంటకూ పెరుగుతుండటంతో సత్తుపల్లి పరిసర ప్రాంతాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. రవాణా నిలిచిపోవడం, రెస్క్యూ సిబ్బంది గల్లంతవడం, మత్స్యకారులు వరదల్లో చిక్కుకోవడం వంటి పరిణామాలు ఈ ప్రాంతంలో పరిస్థితి ఎంత తీవ్రమైందో తెలియజేస్తున్నాయి. మొత్తంగా ఖమ్మం జిల్లా సత్తుపల్లి ప్రాంతంలో చోటుచేసుకున్న ఈ ఘటన భారీ వర్షాలు, వరదలు సృష్టించే విధ్వంసానికి ఒక తీవ్ర ఉదాహరణగా నిలుస్తోంది. బేతుపల్లి చెరువు వద్ద ప్రారంభమైన మత్స్యకారుల రక్షణ చర్యలు ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది గల్లంతయ్యే ప్రమాదకర పరిస్థితికి చేరుకోవడం తీవ్ర విషాదాన్ని నింపింది. ప్రస్తుతం గల్లంతైన సిబ్బంది ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

ఖమ్మం బాండ్ల బాగోతం


మొదటిపేజీ తరువాయి



రూ.150 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారనే ఫిర్యాదులు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటికే భూముల రిజిస్ట్రేషన్లు, ఆస్తుల లావాదేవీలు, అద్దె ఒప్పందాలు వంటి పనులతో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న సామాన్యులకు ఈ అదనపు భారం మరింత సమస్యగా మారింది. ప్రభుత్వ ధర ఒకటైతే, క్షేత్రస్థాయిలో వసూలు చేస్తున్న మొత్తం మరొకటిగా ఉండటంతో స్టాంప్ పేపర్ల విక్రయాల్లో పారదర్శకతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి నాన్ జ్యుడీషియల్ బాండ్ పేపర్లు అనేవి సాధారణ కాగితాలు కావు. అద్దె ఒప్పందాలు, భూముల కొనుగోలు, అమ్మకాలు, ఆస్తుల బదలాయింపు, అఫిడవిట్లు, వివిధ చట్టపరమైన హామీ పత్రాల తయారీలో వీటికి కీలకమైన ప్రాధాన్యత ఉంటుంది. అందుకే ప్రభుత్వం నిర్ణయించిన విలువతోనే వీటిని విక్రయించాల్సి ఉంటుంది. రూ.10, రూ.20, రూ.50, రూ.100, రూ.500 వంటి వివిధ విలువలతో బాండ్ పేపర్లు అందుబాటులో ఉంటాయి. అధీకృత స్టాంప్ వెండర్లు, పోస్టాఫీసులు, బ్యాంకుల ద్వారా వీటిని కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సుమారు 150 నుంచి 250 మందికి పైగా లైసెన్స్ పొందిన స్టాంప్ వెండర్లు ఉన్నట్లు అంచనా. వీరి ద్వారా ప్రతిరోజూ రూ.10 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు లావాదేవీలు జరుగుతున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన మార్గంలో ట్రెజరీ లేదా స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ నుంచి వెండర్లు బాండ్ పేపర్లు సేకరిస్తారు. అంతేకాదు, విక్రయాలపై ప్రభుత్వం ఐదు శాతం వరకు కమీషన్ కూడా చెల్లిస్తోంది. అంటే అధికారికంగా ఆదాయం పొందుతున్నప్పటికీ, కొందరు అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఈ వ్యవహారాన్ని మరింత తీవ్రమైన అంశంగా మారుస్తున్నాయి. ఇక అసలు సమస్య కృత్రిమ కొరత సృష్టించడమేనని విమర్శలు వినిపిస్తున్నాయి. అవసరమైన సమయంలో బాండ్ పేపర్లు దొరకవని చెప్పడం, స్టాక్ లేదంటూ ప్రజలను భయపెట్టడం, చివరకు అధిక ధరకు విక్రయించడం వంటి పద్ధతులు కొనసాగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వాస్తవానికి కొన్ని ప్రాంతాల్లో బాండ్ పేపర్లు అందుబాటులో ఉన్నప్పటికీ, కావాలనే కొరత ఉందంటూ ప్రచారం చేస్తున్నారని బాధితులు చెబుతున్నారు. భూమి రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వ్యక్తి అయినా, బ్యాంకు రుణం కోసం అఫిడవిట్ సమర్పించాల్సిన వ్యక్తి అయినా, అద్దె ఒప్పందం చేసుకునే కుటుంబం అయినా చివరి నిమిషంలో బాండ్ పేపర్ అవసరం తప్పనిసరి అవుతుంది. ఆ పరిస్థితిని కొందరు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, కోర్టుల పరిసరాల్లో ఉండే డాక్యుమెంట్ రైటర్లు, బ్రోకర్లతో కలిసి కొందరు వెండర్లు సిండికేట్‌గా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో అధికారిక ధరకు కొనుగోలు చేసే అవకాశం ఉన్నప్పటికీ, ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో అదనపు డబ్బులు చెల్లించాల్సి వస్తోంది. ఇది కేవలం అధిక ధరల సమస్య మాత్రమే కాదు, ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీసే పరిణామం కూడా. మరోవైపు ఈ వ్యవహారంపై స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల పర్యవేక్షణ ఎక్కడనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. లైసెన్స్ పొందిన వెండర్లు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తున్నారా లేదా అన్నది నిరంతరం తనిఖీ చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది. అయినప్పటికీ బహిరంగంగా అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు రావడం పర్యవేక్షణ లోపాలను బయటపెడుతోంది. ఈ అంశంపై ఖమ్మం జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాస్ స్పందిస్తూ, ఇప్పటివరకు తమకు ఎలాంటి అధికారిక ఫిర్యాదులు అందలేదని తెలిపారు. ఎవరైనా అధిక ధరలకు బాండ్ పేపర్లు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని, అక్రమాలకు పాల్పడిన వారి లైసెన్సులు సైతం రద్దు చేస్తామని స్పష్టం చేశారు. జిల్లాలో బాండ్ పేపర్ల కొరత లేదని, కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని వెల్లడించారు. ఫిర్యాదులు లేవని అధికారులు చెబుతున్నప్పటికీ, బాధితులు ముందుకు వచ్చి ఫిర్యాదు చేయడానికి వెనుకాడుతున్న పరిస్థితులు కూడా ఉండవచ్చనే అంశాన్ని విస్మరించకూడదు. అందుకే కేవలం ఫిర్యాదుల కోసం ఎదురుచూడకుండా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. ఈ అక్రమ వసూళ్లకు శాశ్వతంగా అడ్డుకట్ట వేయడంలో ఈస్టాంపింగ్ విధానం కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. ఇప్పటికే స్టాంప్ వెండర్ల అక్రమాలకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం ఈస్టాంపింగ్ వంటి డిజిటల్ విధానాలను ప్రోత్సహిస్తోంది. దీనివల్ల నిర్ణీత విలువకు అనుగుణంగా స్టాంప్ డ్యూటీ చెల్లించే అవకాశం ఉండటంతో పాటు, మధ్యవర్తుల ప్రమేయం, కృత్రిమ కొరత వంటి సమస్యలను తగ్గించవచ్చు. అయితే డిజిటల్ విధానాలు అందుబాటులోకి రావడంతోనే సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందని భావించలేం. వాటిపై ప్రజలకు అవగాహన కల్పించడం, అన్ని ప్రాంతాల్లో అందుబాటులో ఉంచడం, అక్రమ వసూళ్లపై కఠినమైన నిఘా పెట్టడం కూడా అంతే ముఖ్యం. అధిక ధరలకు బాండ్ పేపర్లు విక్రయిస్తే స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని జిల్లా రిజిస్ట్రార్ సూచిస్తున్నారు. అదే సమయంలో విక్రేతలు నిర్ణీత ధరకు మించి డబ్బులు అడిగితే రసీదు కోరడం, అధికారులకు సమాచారం అందించడం ద్వారా ప్రజలు కూడా అక్రమాలను వెలుగులోకి తీసుకురావచ్చు. ప్రభుత్వమే కమీషన్ చెల్లిస్తున్న వ్యవస్థలో అదనపు వసూళ్లకు ఆస్కారం ఉండకూడదు. సామాన్యుడి అవసరాన్ని వ్యాపారంగా మార్చుకుని దోచుకునే ఈ విధానానికి అడ్డుకట్ట పడాలంటే అధికారుల తనిఖీలు, పారదర్శక విక్రయాలు, బాధ్యులపై కఠిన చర్యలు తప్పనిసరి. లేకపోతే ప్రజల అవసరాలకు ఉపయోగపడాల్సిన బాండ్ పేపర్లే కొందరి అక్రమ సంపాదనకు సాధనాలుగా మారే ప్రమాదం ఉంది.

ఇద్దరి మహిళల దారుణ హత్య

విశాలభారతి, స్టేట్ బ్యూరో:



హైదరాబాద్‌లోని మీర్‌పేట్‌లో చోటుచేసుకున్న జంట హత్యలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. కుటుంబ కలహాలు చివరకు రెండు ప్రాణాలను బలిగొన్నాయి. కుటుంబ సభ్యుల మధ్య నెలకొన్న వివాదాలు, ముందస్తు హెచ్చరికలు, పోలీసులను ఆశ్రయించినా దక్కని రక్షణ.. ఈ పరిణామాలన్నీ ఇప్పుడు ఈ ఘటనను మరింత సంచలనంగా మార్చాయి. మీర్‌పేట్‌లో అల్లుడు సిద్ధిక్ అత్యంత కిరాతకంగా వ్యవహరించి కుటుంబానికి చెందిన ఇద్దరు మహిళలను కత్తితో దాడి చేసి హత్య చేసినట్లు సమాచారం. ఈ దాడిలో అత్త బి. నిరంజన్‌తో పాటు, బావమరిది భార్య రేష్మ ప్రాణాలు కోల్పోయారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మహిళలు దారుణ హత్యకు గురికావడంతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి. కుటుంబ సమస్యలు పరిష్కారం కాకపోతే ఎంతటి విషాదానికి దారితీస్తాయో ఈ ఘటన మరోసారి చాటిచెప్పింది. ఈ ఘటనలో అత్యంత ఆందోళన కలిగించే అంశం.. హత్యలకు ముందే బాధిత కుటుంబం పోలీసులను ఆశ్రయించడం. తమకు సిద్ధిక్ నుంచి ప్రాణహాని ఉందని, కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలని కోరుతూ బుధవారం ఉదయం మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లినట్లు తెలుస్తోంది. సిద్ధిక్‌తో తమకు ప్రమాదం పొంచి ఉందని, అతడి నుంచి ఏ క్షణమైనా దాడి జరిగే అవకాశం ఉందని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. అయితే, పోలీసులను ఆశ్రయించిన కొద్దిసేపటికే పరిస్థితి ఇంతటి దారుణంగా మారడం తీవ్ర చర్చకు దారితీసింది. ముందస్తుగా ప్రమాదాన్ని గుర్తించి ఫిర్యాదు చేసినప్పటికీ ఇద్దరు మహిళల ప్రాణాలు కాపాడలేకపోయారనే ఆరోపణలు ఇప్పుడు వినిపిస్తున్నాయి. తమ కుటుంబానికి రక్షణ కల్పించడంలో పోలీసులు విఫలమయ్యారని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదు అందిన సమయంలో పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకున్నారు, బాధితుల భద్రత కోసం ఎలాంటి ఏర్పాట్లు చేశారు అనే అంశాలు ఇప్పుడు కీలకంగా మారాయి. కుటుంబ కలహాలే ఈ దారుణానికి ప్రధాన కారణమని ప్రాథమికంగా తెలుస్తున్నప్పటికీ, అసలు వివాదం ఎక్కడ మొదలైంది, ఏ అంశంపై కుటుంబ సభ్యుల మధ్య గొడవలు జరిగాయి అనే విషయాలు ఇంకా పూర్తిగా స్పష్టతకు రాలేదు. అయితే, వ్యక్తిగత విభేదాలు ఎంతకాలంగా కొనసాగుతున్నాయి, గతంలో కూడా సిద్ధిక్ నుంచి బాధిత కుటుంబానికి బెదిరింపులు వచ్చాయా, ఈ దాడికి ముందుగా ఏదైనా ఘర్షణ జరిగిందా అనే కోణాల్లో దర్యాప్తు జరగాల్సి ఉంది. కుటుంబంలో తలెత్తే వివాదాలు సామరస్యంగా పరిష్కరించుకోకుండా బెదిరింపులు, దాడుల వరకు వెళ్లడం సమాజంలో ఆందోళన కలిగించే పరిణామం. ముఖ్యంగా మహిళల భద్రత విషయంలో ఇలాంటి ఘటనలు అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ఒక వ్యక్తిపై ప్రాణహాని ఆరోపణలు వచ్చినప్పుడు, వాటిని సాధారణ కుటుంబ వివాదంగా పరిగణించకుండా ప్రమాద తీవ్రతను అంచనా వేయడం ఎంత ముఖ్యమో ఈ ఘటన స్పష్టం చేస్తోంది. మరోవైపు, ఇద్దరు మహిళలను హత్య చేసిన అనంతరం నిందితుడు సిద్ధిక్ అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. ఘటన గురించి తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని అవసరమైన తదుపరి చర్యలు చేపట్టారు. ఈ జంట హత్యలపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడు ఎక్కడికి వెళ్లాడు, ఎవరైనా అతడికి సహకరించారా, హత్యకు ఉపయోగించిన కత్తి సహా ఇతర ఆధారాలు ఏమి లభించాయి అనే అంశాలపై పోలీసులు దృష్టి సారించారు. సిద్ధిక్ ఆచూకీ కోసం ప్రత్యేకంగా గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఘటన జరిగిన ప్రాంతంలోని సీసీటీవీ దృశ్యాలు, స్థానికుల సమాచారం, కుటుంబ సభ్యుల వాంగ్మూలాలు దర్యాప్తులో కీలకంగా మారే అవకాశం ఉంది. నిందితుడిని త్వరగా పట్టుకుని హత్యలకు సంబంధించిన పూర్తి వివరాలను వెలుగులోకి తీసుకురావాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది. మొత్తంగా మీర్‌పేట్ జంట హత్యల ఘటన కేవలం ఒక కుటుంబంలో జరిగిన ఘర్షణగా చూడలేని పరిస్థితి నెలకొంది. హత్యలకు ముందు ప్రాణహాని ఉందని బాధితులు పోలీసులకు చెప్పడం, ఆ తర్వాత కొద్దిసేపటికే ఇద్దరు మహిళలు హత్యకు గురికావడం ఈ ఘటనలో అత్యంత కీలకమైన అంశం. ఫిర్యాదు అందినప్పటి నుంచి హత్యలు జరిగే వరకు ఏం జరిగింది, బాధిత కుటుంబానికి తగిన భద్రత ఎందుకు కల్పించలేకపోయారు, పోలీసుల స్పందనలో ఏమైనా లోపాలు ఉన్నాయా అనే విషయాలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో కుటుంబ కలహాల పేరుతో ప్రాణాలు తీసే హింసాత్మక ధోరణికి అడ్డుకట్ట వేయడం కూడా అత్యవసరం. ఇద్దరు మహిళల ప్రాణాలను బలిగొన్న ఈ దారుణ ఘటనలో నిందితుడిని అరెస్ట్ చేసి, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూడటంతో పాటు, ముందస్తు ఫిర్యాదుపై పోలీసుల చర్యలను కూడా స్పష్టంగా వెల్లడించాల్సిన అవసరం ఉంది.



ఆరు నెలలైనా అందలే..!

మొదటిపేజీ తరువాయి

యూనిఫామ్‌లు విద్యార్థులకు చేరాల్సి ఉంది. ఇందులో మరో ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, దాదాపు లక్షా 60 వేల యూనిఫామ్‌లకు ఇప్పటివరకు కుట్టు పనులే ప్రారంభం కాలేదు. అంటే తయారీ దశలోనే ఇంత భారీ జాప్యం ఉండటం, పంపిణీ ప్రక్రియ ఎంత నెమ్మదిగా సాగుతుందో స్పష్టం చేస్తోంది. ముఖ్యంగా కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు ఒక జత మాత్రమే అందగా, మరికొన్ని చోట్ల అసలు యూనిఫామ్‌లే అందలేదని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చెబుతున్నారు. పేద కుటుంబాల పిల్లలకు ఉచితంగా దుస్తులు అందించడం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం ఆర్థిక భారం తగ్గించడమే. కానీ విద్యా సంవత్సరం సగం పూర్తయిన తర్వాత యూనిఫామ్‌లు అందితే ఆ పథకం ద్వారా విద్యార్థులకు కలిగే ప్రయోజనం కూడా పరిమితంగానే మిగులుతుంది. ఇక్కడ మరో కీలకమైన అంశం ఉంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖను తన దగ్గరే ఉంచుకున్నారు. విద్యారంగాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ఈ శాఖను స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు గతంలో పలుమార్లు ప్రకటించారు. అయినప్పటికీ యూనిఫామ్‌ల పంపిణీలో ఇంతటి జాప్యం జరగడం పాలనా పర్యవేక్షణపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. వివిధ విద్యాసంస్థల పనితీరును పరిశీలిస్తే పరిస్థితి మరింత స్పష్టమవుతోంది. ఇంటర్మీడియెట్ విద్యాసంస్థల్లో కేవలం 50 శాతం పంపిణీ మాత్రమే పూర్తయింది. ఉర్దూ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 67 శాతం, రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ సొసైటీలో 72 శాతం, మైనారిటీ గురుకులాల్లో 75 శాతం పంపిణీ జరిగింది. ఇక ఏకలవ్య పాఠశాలల్లో 6,754 మంది విద్యార్థులకు అవసరమైన 13,508 యూనిఫామ్‌లలో ఒక్కటి కూడా పంపిణీ కాలేదు. ఇంటర్ విద్యాసంస్థల్లో 2 లక్షల 32 వేలకుపైగా అవసరమైన యూనిఫామ్‌లలో లక్షా 39 వేలకుపైగా ఇంకా పెండింగ్‌లో ఉండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. మరోవైపు కొన్ని శాఖల్లో యూనిఫామ్‌ల కుట్టు పనులు పూర్తయినా పంపిణీ మాత్రం జరగడం లేదు. పాఠశాల విద్యాశాఖ పరిధిలో 17 లక్షల 34 వేల మందికిపైగా విద్యార్థులకు 34 లక్షల 69 వేల యూనిఫామ్‌లు అవసరం కాగా, 34 లక్షల 84 వేలకుపైగా యూనిఫామ్‌లు కుట్టడం పూర్తయింది. అంటే అవసరానికి మించి దుస్తులు సిద్ధంగా ఉన్నప్పటికీ లక్షా 8 వేల 937 యూనిఫామ్‌లు ఇంకా విద్యార్థులకు చేరలేదు. మైనారిటీ గురుకులాల్లో లక్షా 80 వేల 250 యూనిఫామ్‌లు అవసరం కాగా, లక్షా 23 వేల 622 మాత్రమే పంపిణీ అయ్యాయి. మిగిలిన వాటిలో 45 వేలకుపైగా దుస్తులకు కుట్టు పనులే ప్రారంభం కాలేదు. మోడల్ పాఠశాలల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. మొత్తం లక్షా 89 వేల 264 యూనిఫామ్‌లకు గాను లక్షా 57 వేల 791 మాత్రమే అందాయి. మరోవైపు ఎంజేపీ బీసీ గురుకులాల్లో మాత్రం దాదాపు పంపిణీ పూర్తయింది. ఈ గణాంకాలు పరిశీలిస్తే సమస్య కేవలం దుస్తుల తయారీలోనే లేదని, సిద్ధమైన యూనిఫామ్‌లను పాఠశాలలకు చేర్చడంలోనూ సమన్వయ లోపం ఉందని అర్థమవుతోంది. అంటే కొన్ని చోట్ల ఉత్పత్తి పూర్తయినా పంపిణీ ఆగిపోగా, మరికొన్ని చోట్ల ఉత్పత్తి ప్రక్రియే మొదలుకాలేదు. మొత్తంగా చూస్తే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్‌లు అందించాలనే లక్ష్యం మంచిదే అయినప్పటికీ, దాన్ని అమలు చేసే విధానంలో అనేక లోపాలు బయటపడుతున్నాయి. విద్యార్థులకు సౌకర్యాలు కల్పించామని ప్రకటనలు చేయడం కంటే, అవి సరైన సమయంలో అందేలా చూడటం ప్రభుత్వానికి అసలైన బాధ్యత. ముఖ్యంగా విద్యాశాఖ ముఖ్యమంత్రి దగ్గరే ఉన్న నేపథ్యంలో ఈ జాప్యానికి బాధ్యత ఎవరు తీసుకుంటారనే అంశం కీలకంగా మారింది. ఇప్పటికే ఆరు నెలలు గడిచిపోయాయి. మిగిలిన యూనిఫామ్‌ల కుట్టు పనులు పూర్తి చేయడం, సిద్ధంగా ఉన్న దుస్తులను వెంటనే విద్యార్థులకు అందించడం, ఏయే పాఠశాలల్లో ఎంతమంది విద్యార్థులకు యూనిఫామ్‌లు అందలేదో గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకోవడం అత్యవసరం. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే పిల్లలు కూడా సమానమైన గౌరవం, సౌకర్యాలు పొందాలి. వారి అవసరాలను గణాంకాలుగా కాకుండా ప్రాధాన్యతగా చూడాలి. ఎందుకంటే విద్యార్థులకు ఇచ్చిన హామీని సకాలంలో నిలబెట్టుకున్నప్పుడే ప్రభుత్వ విద్యపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది. లేకపోతే ఉచిత యూనిఫామ్‌ల పథకం కూడా ప్రకటనలకే పరిమితమైన మరో ప్రభుత్వ హామీగా మిగిలిపోయే ప్రమాదం ఉంది.

కరువుపై కరుణేది

మొదటిపేజీ తరువాయి



దీంతో మిగిలిన 27 మండలాల రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమ ప్రాంతాల్లోనూ నీటి కొరత, పంట నష్టాలు ఉన్నాయని చెబుతున్నారు. ప్రభుత్వ నిర్ణయంలో తమకు అన్యాయం జరిగిందనే భావన రైతుల్లో పెరుగుతోంది. కరువు తీవ్రతను మండలాల సరిహద్దులతో కాకుండా వాస్తవ పరిస్థితుల ఆధారంగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఈ నెల 24న జారీ చేసిన జీవో నంబర్ 3 ప్రకారం ఉమ్మడి ఆదిలాబాద్‌లో నాలుగు జిల్లాలకు కరువు హోదా వర్తించింది. ఆదిలాబాద్ జిల్లాలో 20 మండలాలు జాబితాలో ఉన్నాయి. భీంపూర్, ఇంద్రవెల్లి, ఆదిలాబాద్ అర్బన్, సిరికొండ ప్రాంతాలను తీవ్ర కరువు మండలాలుగా గుర్తించగా, మరో 16 మండలాలకు మధ్యస్థ హోదా ఇచ్చారు. నిర్మల్ జిల్లాలో ఖానాపూర్‌కు తీవ్ర కరువు గుర్తింపు లభించింది. కుబీర్, భైంసా, కుంటాల, నిర్మల్ అర్బన్, సోన్, లక్ష్మణచందా, కడెంపెద్దూర్, దస్తురాబాద్ మధ్యస్థ జాబితాలో చేరాయి. మంచిర్యాల జిల్లాలో జన్నారం, దండేపల్లి, హాజీపూర్, వేమనపల్లి, నెన్నెల, మందమర్రి, మంచిర్యాల, నస్పూర్, భీమారం, చెన్నూరు, కోటపల్లి మండలాలను గుర్తించారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో జైనూర్, సిర్పూర్ యు, కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూర్ ప్రాంతాలకు మధ్యస్థ కరువు హోదా దక్కింది. వర్షపాతం, పంటల విస్తీర్ణం, నేలలో తేమ, భూగర్భ జలాలు, ఉపగ్రహ చిత్రాలు, క్షేత్రస్థాయి అంచనాల ఆధారంగా ఈ ఎంపిక చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. వానాకాలం ప్రారంభంలో కొంత వర్షం కురిసినా పంటలకు అత్యవసరమైన సమయంలో వానలు ముఖం చాటేశాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులు, కుంటలు అడుగంటిపోవడంతోపాటు బోరుబావుల్లో నీటిమట్టాలు తగ్గిపోయాయి. ముఖ్యంగా వరి, పత్తి సాగు చేసిన రైతులు పెట్టుబడులు తిరిగి వస్తాయనే ఆశలు కోల్పోతున్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల కోసం చేసిన ఖర్చులు ఇప్పుడు భారంగా మారాయి. నిర్మల్ జిల్లాలోని సారంగాపూర్, లోకేశ్వరం, ముధోల్, నర్సాపూర్ జి, మామడ, నిర్మల్ రూరల్ రైతులు తమ ప్రాంతాలను కూడా కరువు జాబితాలో చేర్చాలని కోరుతున్నారు. మరోవైపు కరువు మండలాల్లో వ్యవసాయ పెట్టుబడి సాయం, తాగునీరు, పశుగ్రాసం, పశువుల శిబిరాలు, గ్రామీణ ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. బ్యాంకులతో చర్చించి వ్యవసాయ రుణాల పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని, బలవంతపు వసూళ్లను నివారించాలని సూచించింది. అయితే కేంద్రం నుంచి ఎన్‌డీఆర్‌ఎఫ్ నిధులు అందిన తర్వాత నెలలోపు రైతుల ఖాతాల్లో సాయం జమచేసేలా చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రైతుల సమస్యలపై నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడతాయని కేంద్రం ఆరు నెలల ముందే హెచ్చరించినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమైందని విమర్శించారు. రైతులకు పంటలు వేయవద్దని సూచించడం తప్ప ఆర్థికంగా ఎలా ఆదుకుంటారనే దానిపై స్పష్టత ఇవ్వలేదని ఆరోపించారు. మహారాష్ట్ర ప్రభుత్వం కరువు పరిస్థితుల్లో రైతుల కోసం రూ.7 వేల కోట్లు విడుదల చేసిందని గుర్తుచేశారు. గుజరాత్ ప్రభుత్వం హెక్టారుకు రూ.8,500 సాయం అందిస్తోందని పేర్కొన్నారు. తెలంగాణలోనూ పంట నష్టాలను క్షేత్రస్థాయిలో అంచనా వేసి ఎకరాకు రూ.15 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మరోవైపు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఉమ్మడి ఆదిలాబాద్ మొత్తాన్ని కరువు జిల్లాగా ప్రకటించాలని కోరారు. గిరిజనులు, వర్షాధార రైతులు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో కేవలం 45 మండలాలకే హోదా ఇవ్వడం సరికాదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రైతుల కష్టాలను గుర్తించి తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. కరువు మండలాల ఎంపిక ఇప్పుడు ఉమ్మడి ఆదిలాబాద్‌లో రాజకీయంగా కీలక అంశంగా మారుతోంది. రైతుల అసంతృప్తిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు బీజేపీ, బీఆర్‌ఎస్, వామపక్ష పార్టీలు ఆందోళనలకు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే పలుచోట్ల రైతులు రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్నారు. తమ మండలాల్లో పంటలు దెబ్బతిన్నప్పుడు ప్రభుత్వ సాయం ఎందుకు అందకూడదనే ప్రశ్నను ముందుకు తెస్తున్నారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కూడా ప్రభుత్వం నిర్ణయాన్ని మార్చుకోకపోతే బీఆర్‌ఎస్ తరఫున నిరసనలు చేపడతామని హెచ్చరించారు. మరోవైపు కరువు హోదా వచ్చిన ప్రాంతాల్లోనూ పరిహారం ఎప్పుడు అందుతుందనే ఆందోళన కొనసాగుతోంది. పంట నష్టాల లెక్కింపు, అర్హులైన రైతుల ఎంపిక, నిధుల విడుదల వంటి అంశాల్లో స్పష్టత అవసరమైంది. ముఖ్యంగా సాగుకు పెట్టిన డబ్బులు తిరిగి రాక అప్పుల్లో చిక్కుకున్న రైతులకు తక్షణ సహాయం కీలకం. ప్రభుత్వం అన్ని మండలాల్లో వర్షపాతం, సాగునీటి లభ్యత, భూగర్భ జలాల స్థాయి, పంటల పరిస్థితులను మరోసారి అంచనా వేయాలనే డిమాండ్ బలపడుతోంది.

మహేశ్వరం మెడికల్ కాలేజీలో విద్యార్థుల సమస్యల పరిశీలన

- **హాస్టల్, క్యాంటీన్, మౌలిక వసతులపై ఆరా తీసిన హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి**


విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :

ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని మంగళ్‌పల్లిలో భారత్ ఇంజనీరింగ్ కాలేజ్ క్యాంపస్‌లో తాత్కాలికంగా నిర్వహిస్తున్న మహేశ్వరం మెడికల్ కాలేజీని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ శాసనసభాపక్ష నేత తన్నీరు హరీష్ రావు, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, రంగారెడ్డి జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, భువనగిరి పార్లమెంట్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి క్యామ మల్లేష్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు, ఇబ్రహీంపట్నం నాయకులు దండెం రాంరెడ్డి తదితరులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మెడికల్ కాలేజీలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను నాయకులు నేరుగా పరిశీలించారు. ముఖ్యంగా హాస్టల్, క్యాంటీన్‌తో పాటు ఇతర మౌలిక వసతులకు సంబంధించిన ఇబ్బందులపై ఆరా తీశారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థుల సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపిన ఈ సందర్భంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



మరో నాలుగు నగరాల్లో ఇందిరమ్మ టవర్లు

మొదటిపేజీ తరువాయి



నిర్మించనున్నట్లు హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ నగరాల్లో జీ+5 విధానంలో ఈ టవర్లను నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. దీపావళిలోగా నిర్మాణాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేస్తామని మంత్రి వెల్లడించారు. హైదరాబాద్‌లో అమలు చేస్తున్న గృహ నిర్మాణ విధానాన్ని ఇతర కార్పొరేషన్లకు కూడా విస్తరించడం ద్వారా పట్టణ ప్రాంతాల్లో నివాస సమస్యలకు పరిష్కారం చూపాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ప్రకటన తెలంగాణలో గృహ నిర్మాణ రంగానికి కొత్త దిశను సూచిస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో ఇప్పటివరకు సాధించిన పురోగతిని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించారు. మొదటి విడతలో ప్రభుత్వం మొత్తం 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేయగా, ఇప్పటివరకు 2,21,500 ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తయ్యాయని తెలిపారు. అంటే మంజూరైన ఇళ్లలో దాదాపు సగం కుటుంబాలు ఇప్పటికే తమ సొంత నివాసాల్లోకి అడుగుపెట్టాయి. మరో 1.90 లక్షల ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నట్లు వెల్లడించారు. ఈ గణాంకాలు పథకం అమలులో కనిపిస్తున్న పురోగతిని తెలియజేస్తున్నాయి. సొంత ఇల్లు అనేది కేవలం నాలుగు గోడల నిర్మాణం మాత్రమే కాదు. పేద కుటుంబాలకు అది భద్రత, ఆత్మగౌరవం, భవిష్యత్తుపై నమ్మకానికి ప్రతీక. ముఖ్యంగా అద్దె ఇళ్లలో నివసించే కుటుంబాలకు సొంత నివాసం లభించడం వారి ఆర్థిక పరిస్థితిపై కూడా సానుకూల ప్రభావం చూపుతుంది. అందుకే ప్రభుత్వం ఈ పథకాన్ని వేగంగా ముందుకు తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకుంది. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో కూడా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ విడతలో 2.50 లక్షల ఇళ్లతో పాటు హైదరాబాద్ క్యూర్ పరిధిలో మరో లక్ష ఇళ్లను మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం గృహ నిర్మాణ కార్యక్రమానికి రూ.40 వేల కోట్ల వ్యయం చేయనున్నట్లు వెల్లడించారు. ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో ఉన్నప్పటికీ పేదలకు ఇళ్లు నిర్మించాలనే సంకల్పం నుంచి ప్రభుత్వం వెనక్కి తగ్గబోదని స్పష్టం చేశారు. ఈ ప్రకటనలో ముఖ్యమైన అంశం ఏమిటంటే, గృహ నిర్మాణాన్ని కేవలం సంక్షేమ కార్యక్రమంగా కాకుండా రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం చూస్తోంది. భారీ స్థాయిలో ఇళ్ల నిర్మాణం జరిగితే నిర్మాణ రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. సిమెంట్, ఇసుక, ఇటుకలు, ఇతర నిర్మాణ సామగ్రి రంగాలకు కూడా డిమాండ్ ఏర్పడుతుంది. అయితే ఈ లక్ష్యాలు పూర్తిస్థాయిలో నెరవేరాలంటే నిధుల విడుదల, నిర్మాణాల పర్యవేక్షణ, లబ్ధిదారులకు సకాలంలో సహాయం అందించడం కీలకంగా మారనున్నాయి. ఇదిలా ఉంటే, ఇందిరమ్మ ఇళ్లలో ఈ దీపావళి వేడుకలను ప్రత్యేకంగా నిర్వహించాలని ప్రభుత్వం పిలుపునిచ్చింది. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కేంద్రంలో మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి "మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు" అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ప్రవళిక మృతికి సంతాపం వ్యక్తం చేసిన
తుళ్లూరి బ్రహ్మయ్య

- మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, విశాల భారతి :



తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ మణుగూరు డిపోలో మహిళా కండక్టర్ విధులు నిర్వహిస్తూ మహిళా ప్రయాణికురాలతో జరిగిన సంఘటనలో బస్సులోంచి కిందపడి గాయాల పాలై హైదరాబాదులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుండ్ల ప్రవళిక మృతి పట్ల కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు తుళ్లూరి బ్రహ్మయ్య తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆమె మృతి కుటుంబానికి తీరనిలోటని ఆయన అన్నారు. ప్రవళిక కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమె కుటుంబానికి అండగా ఉంటుందని, అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించడం మృతురాలి తల్లి, కుటుంబానికి కొండంత భరోసాను ఇచ్చిందని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అండగా ఉంటామని కలపడం హర్షనీయం :

ప్రవళిక మృతి చెందిందని తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రవాణా శాఖ మంత్రి ఉస్మానియా ఆసుపత్రి మార్చురీ వద్దకు వెళ్లి ఆమె మృతదేహానికి నివాళులర్పించడం తోపాటు వారి కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇవ్వడం హర్షించ దగ్గ విషయం అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమె తల్లికి ఉద్యోగంతో పాటు 10 లక్షలు ఎక్స్గ్రేషియా, ఇందిరమ్మ ఇల్లు అలాగే ఆర్టీసీ సంస్థ ద్వారా వచ్చే ఇతర పరిహారాలను అందించేలా చూస్తామనడం మృతురాలి కుటుంబానికి కొండంత భరోసాని ఇచ్చిందన్నారు. ప్రవళిక మృతి అత్యంత బాధాకరమైనప్పటికీ ఆమె తల్లి గర్భశోకాన్ని తట్టుకునేలా ఆ భగవంతుడు ఆమెకి మనోధైర్యాన్ని ప్రసాదించాలని తుళ్ళూరి కోరారు.

అధిక ధరలకు బియ్యం విక్రయిస్తే
కఠిన చర్యలు చేపడతాం



- సివిల్ సప్లై కలెక్టర్ వేణుగోపాల్
- కొత్తగూడెంలో విస్తృతంగా బియ్యం షాపుల తనిఖీలు

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, విశాల భారతి :

అధిక ధరలకు బియ్యం విక్రయిస్తే నిత్యవసర సరుకుల చట్టం ప్రకారం కఠిన చర్యలు చేపడతామని సివిల్ సప్లై కలెక్టర్ వేణుగోపాల్ అన్నారు. నిత్యవసరాల కమీషనర్ సివిల్ సప్లైస్ ఉన్నత అధికారుల ఆదేశాలనుసారం బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం పట్టణంలో గల బియ్యం వ్యాపార సముదాయాలను విస్తృతంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బియ్యం వ్యాపారం నిర్వహిస్తున్న దుకాణాల ముందు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం విక్రయాలు చేపట్టాలని ధరల పట్టికలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ప్రతి దుకాణం ముందు వ్యాపారులు ఈ ధరల పట్టికలతో కూడిన బోర్డులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించి అధిక ధరలకు బియ్యం విక్రయిస్తే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం కాకుండా అధిక ధరలకు వ్యాపారులు, రైస్ మిల్లర్లు యజమానులు విక్రయాలు చేపట్టినట్లు తెలిస్తే వినియోగదారులు వెంటనే సివిల్ సప్లై అధికారులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. నిత్యవసర సరుకుల చట్టం 6 ఏ ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. ఆయన వెంట తనిఖీలు నిర్వహించిన వారిలో వివిధ మండలాల సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దార్లు శంకర్ రావు, ప్రభాకర్, జి. రాజులు, ఎం. రాజేశ్వరరావు ఉన్నారు.

డిజిటల్ తూనికల్లో మాయాజాలంపై దృష్టి సారించాలి

బియ్యంతో పాటు, ఇతర నిత్యవసర సరుకుల ధరలపై కూడా సంబంధిత శాఖల అధికారులు నిఘా ఏర్పాటు చేసి వినియోగదారులకు మేలు చేకూరేలా చేయాలని ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా వ్యాపార సముదాయాల్లో ఏర్పాటు చేసిన డిజిటల్ తూనికల్లో జరుగుతున్న అవకతవకలపై ఆ శాఖ అధికారులు నిఘా ఏర్పాటు చేసి వినియోగదారులకు జరుగుతున్న మోసాలను పసిగట్టి చర్యలు చేపట్టాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రజలు కోరుతున్నారు. కొందరు కిరాణా, కూరగాయలు, మాంసాహారాల నిర్వహణ చేపడుతున్న వ్యాపారులు డిజిటల్ తూనికల నెంబర్లు వినియోగదారులకు కనిపించకుండానే వారి వైపే కనపడేలా కాటాలు పెట్టుకొని ప్రజలను మోసగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా తూనికలు, కొలతల శాఖ అధికారులు ప్రత్యేకంగా ఈ ఎలక్ట్రానిక్ కాటాల వాడకం దారులపై దృష్టి సారించి ప్రజలకు మేలు చేకూరేలా చర్యలు చేపట్టాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నింపిన 'రంగన్న ఆత్మీయ సమ్మేళనం'

- ప్రమీడా గార్డెన్స్‌కు వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు
- కార్యకర్తలకు అండగా ఉంటాం.. పదవుల అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తాం

విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ : ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి బుధవారం బొంగ్లూర్ క్రాస్‌రోడ్స్‌లోని ప్రమీదా గార్డెన్స్‌లో నిర్వహించిన 'రంగన్న ఆత్మీయ సమ్మేళనం' కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమానికి భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు అభిషేక్ రెడ్డితో పాటు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. డప్పులు, డోళ్లతో నాయకులకు స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు.సమ్మేళనంలో మండల, నియోజకవర్గ స్థాయి నాయకులు తమ సమస్యలను, పార్టీ శ్రేణులకు సంబంధించిన పలు అంశాలను ఎంపీ, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లారు. మల్‌రెడ్డి రంగారెడ్డి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను కొనియాడారు. ఆయన నాయకత్వంలో నియోజకవర్గానికి పెద్ద ఎత్తున నిధులు వస్తున్నాయని పేర్కొన్నారు. నామినేటెడ్ పదవులతో పాటు ఇతర అంశాలను రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యకర్తల కోసం ప్రత్యేకంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి అభినందించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన అప్పులు, అవినీతి కారణంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా మారిందని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నిస్తోందని తెలిపారు. కార్యకర్తల్లో ఉన్న అసంతృప్తిని పార్టీ గుర్తించిందని, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో నామినేటెడ్ పదవుల అంశంపై ఎమ్మెల్యేతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా చర్చిస్తానని హామీ ఇచ్చారు.

కండక్టర్ ప్రవళిక మృతికి మర్రి మల్లారెడ్డి సంతాపం

- ఆమె కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్

అశ్వాపురం, విశాల భారతి :

మణుగూరు ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న గుండ్ల ప్రవళిక మృతి పట్ల బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి, మొండికుంట మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆమె మృతి తమను ఎంతగానో కలచివేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే మృతి చెందడం అత్యంత బాధాకరమని, ఆమె మరణం కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు తీరని లోటని పేర్కొన్నారు.ఈ విషాద సమయంలో ప్రవళిక కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ కష్టకాలాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని వారికి ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. ప్రవళిక ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. అదేవిధంగా మృతురాలి కుటుంబ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి అన్ని విధాలా ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

జాలర్లను కాపాడేందుకు వెళ్ళి పది మంది ఎస్‌డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బంది గల్లంతు

- సంఘటన స్థలానికి చేరుకున్న ఎమ్మెల్యే రాగమయి, ఖమ్మం జిల్లా కలెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, విశాల భారతి :

జాలర్లను కాపాడేందుకు వెళ్లిన పది మంది ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది గల్లంతయ్యారు. ఈ ఘటన ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలంలోని బేతుపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం భారీ వర్షాలకు బేతుపల్లి పెద్ద చెరువు అలుగు పారుతుండడంతో చేపలు బయటకు వెళ్లకుండా వలలు ఏర్పాటు చేసేందుకు ఐదుగురు జాలర్లు వెళ్లి వరదలో చిక్కుకున్నారు. వారిని కాపాడేందుకు తొలుత ముగ్గురు ఫైర్ సిబ్బంది బోటులో వెళ్లగా అది మొరాయించడంతో వారు కూడా చెరువులో చిక్కుకుపోయారు. దీంతో కొత్తగూడెం ఎస్‌డీఆర్ఎఫ్‌కు చెందిన ఆరుగురు, మరో నలుగురు ఫైర్ సిబ్బంది రెండు బోట్లలో వారిని కాపాడేందుకు వెళ్లారు. తొలుత బోటులో చిక్కుకుపోయిన ముగ్గురు అగ్నిమాపక సిబ్బందిని వెనక్కి తీసుకొచ్చారు. అనంతరం మత్స్యకారులను తీసుకొచ్చేందుకు వెళ్లగా రెండు బోట్లు పల్టీలు కొట్టి అందులోని 10 మంది గల్లంతయ్యారు. విషయం తెలుసుకున్న ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, ఎమ్మెల్యే మట్టా రాగమయి అక్కడికివెళ్లి సిబ్బందితో కలిసి సహాయ చర్యలు ముమ్మరంగా చేపట్టారు. ఈ క్రమంలో భద్రాచలం నుంచి ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందిని రప్పించి బోటు సహాయంతో చిక్కుకున్న వారిని కాపాడే ప్రయత్నం చేపట్టారు. డ్రోన్‌తో లైఫ్ జాకెట్లు పంపించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బేతుపల్లి చెరువులో ఎస్‌డీఆర్ఎఫ్ బోట్ల గల్లంతైన ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. ఎస్‌డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బందిని సురక్షితంగా తీసుకువచ్చేందుకు అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాల్సిందిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకు సీఎం సూచించినట్లు తెలుస్తోంది.

మృతురాలు తల్లికి ప్రభుత్వం న్యాయం చేయడం హర్షనీయం

- ప్రవళిక మృతికి సంతాప వ్యక్తం చేసిన ఖదీర్

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, విశాల భారతి :



తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ మణుగూరు డిపోలో మహిళా కండక్టర్ విధులు నిర్వహిస్తూ మహిళా ప్రయాణికురాలతో జరిగిన సంఘటనలో బస్సులోంచి కిందపడి గాయాల పాలై హైదరాబాదులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుండ్ల ప్రవళిక మృతి పట్ల కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కో ఆప్షన్ సంఘం మాజీ అధ్యక్షుడు ఎస్కే ఖదీర్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆమె మృతి కుటుంబానికి తీరనిలోటని ఆయన అన్నారు. ప్రవళిక కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమె కుటుంబానికి అండగా ఉంటుందని, అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించడం మృతురాలి తల్లి, కుటుంబానికి కొండంత భరోసాను ఇచ్చిందని పేర్కొన్నారు. ఆ దేవుడు ప్రవళిక తల్లికి మనోధైర్యాన్ని కల్పించాలని భగవంతుని కోరుకున్నాడు.

కండక్టర్ ప్రవళికకు కన్నీటి వీడ్కోలు

- నివాళులర్పించిన కార్మిక సంఘాల నాయకులు

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, విశాల భారతి :



ఆర్టీసీ కండక్టర్ గుండ్ల ప్రవల్లిక కు ఆర్టీసీ కార్మికులు, ప్రజలు కన్నీటి వీడుకోలు పలికారు. పూలమాలలతో నివాళులర్పించారు ఎర్రజెండ కప్పి నివాళులర్పించారు. పినపాక శాసనసభ్యులు పాయ వెంకటేశ్వర్లు ప్రవల్లిక తల్లిని ఓదార్చారు మృతి దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు కార్మికులు ప్రవల్లికకు జోహార్లు అర్పించారు అమర్ హై నినదించారు. అధిక సంఖ్యలో ప్రజలు హాజరై ప్రవల్లిక నివాళులర్పించారు డి.ఎస్.పి వంగ రవీంద్రారెడ్డి సీఐ పి నాగబాబు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు ఎస్ డబ్ల్యూ ఎఫ్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ గద్దం లింగమూర్తి రీజియన్ అధ్యక్షుడు గుండు మాధవ రావు రాష్ట్ర ఉపాధ్యక్షులు బోనాల రాంబాబు డిపో అధ్యక్ష కార్యదర్శులు కాటు సుధాకర్ ఆర్ఎస్ రావు ఖమ్మం డిపో సెక్రటరీ దుగ్గిళ్ళ రోశయ్య ప్రెసిడెంట్ గద్దం వెంకటరామయ్య రాష్ట్ర నాయకులు అల్లంశెట్టి వెంకటేశ్వర్లు రీజినల్ సహాయ కార్యదర్శి కొమరవట్టి ప్రతాప్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం బాబు ప్రధాన కార్యదర్శి గిరి వెంకన్న డిప్యూటీ జనరల్ సెక్రెటరీ రాఘవులు వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్ అప్పారావు సిఐటియు జిల్లా నాయకులు గద్దల శ్రీనివాస్ రావు, సత్రపల్లి సాంబశివరావు, కొడిశాల రాములు అధిక సంఖ్యలో కార్మికులు కార్మిక సంఘాల నాయకులు ప్రజలు పాల్గొన్నారు.



ఎస్సైని కలిసిన బిఆర్ఎస్ మండల
అధ్యక్ష, కార్యదర్శులు

అశ్వాపురం, విశాల భారతి :

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వాపురం పోలీస్ స్టేషన్లో ఇటీవల ఎస్సైగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన శివరామకృష్ణను మండల బిఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు కోడి అమరేందర్, మర్రి మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనకి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణలో సఫలీకృతులై విధి నిర్వహణలో ఉన్నతాధికారుల దగ్గర పేరు ప్రఖ్యాతలు సంపాదించుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎస్సైని కలిసిన వారిలో ఆ పార్టీ నాయకులు మండల గద్దల రామకృష్ణ, చల్లా రాజేష్, గాడిద మహేష్, మంద హుస్సేన్, కడారి సైదులు, డేరింగుల వెంకన్న ఉన్నారు.



చికిత్స పొందుతూ మహిళా కండక్టర్ ప్రవల్లిక మృతి

- మృతికి నిరసనగా బస్సులు బంద్
- మృతి పట్ల సంతాపం తెలిపిన ఆర్టీసీ కార్మికులు

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, విశాల భారతి :

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలోని మిట్టగూడెం వద్ద మణుగూరు డిపో కండక్టర్ ప్రవల్లిక (25) చిల్లర విషయంలో ఓ ప్రయాణికురాలు నెట్టివేయగా కింద పడ్డారు బస్సు చక్రాల కింద పడి రెండు కాళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి ఆమెను మెరుగైన వైద్యం కొరకు హైదరాబాదులోని సాయి సంజీవని ఆసుపత్రి తరలించారు చివరి నిమిషం వరకు మృత్యువుతో పోరాడి మంగళవారం రాత్రి మరణించారు ప్రవల్లిక మృతి పట్ల సంతాపం తెలియజేస్తూ ఆర్టీసీ కార్మికులు బుధవారం కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మణుగూరు డిపో బస్సులు బంద్ నిర్వహించారు అనంతరం మణుగూరులో ఆమెకు సంతాప సూచికంగా ర్యాలీ నిర్వహించారు అంబేద్కర్ సెంటర్లో మానవహారం నిర్వహించారు డిపో ప్రధాన గేటు వద్ద నిరసన తెలిపారు కడు పేదరికంలో ఉంటూ తండ్రి ఉద్యోగం సంపాదించి ప్రవల్లిక సంవత్సరం తిరగకముందుకే మృత్యువాత గురి కావడం మణుగూరు పట్టణంలో విషాదఛాయలనుకున్నాయి మహిళా కండక్టర్లు, ఔట్సోర్సింగ్, హైర్ బస్సుల డ్రైవర్లు, ఆర్టీసీ సిబ్బంది కార్మికులు ప్రవల్లిక మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు తోటి మహిళా మహిళా కండక్టర్ మరణించడంతో డిపో పరిధిలోని మహిళా కండక్టర్లు ఆమెను తలుచుకుంటూ విలపించారు జోహార్లు అర్పించారు కండక్టర్లు, డ్రైవర్ల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్న వారిపై చర్యలు తీసుకునేందుకు కఠినమైన చట్టాలు అమలు చేయాలని నినాదాలు చేశారు విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ కార్మికులపై దాడులను తీవ్రంగా ఖండించారు బందు సంపూర్ణంగా నిర్వహించారు బస్సులు తెల్లవారుజాము నుండి డిపోకే పరిమితమయ్యాయి కండక్టర్ ప్రవల్లిక మృతికి బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాలు రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు డిపో వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డి.ఎస్.పి వంగా రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో సిఐ నాగబాబు ఎస్ఐ నగేష్ కుమార్ భారీ బందోబస్తు నిర్వహించారు డి.ఎస్.పి ఆర్టీసీ కార్మికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు

ప్రవళిక పార్థివ దేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే పాయం

- మృతురాలి కుటుంబానికి అండగా ఉంటాం

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, విశాల భారతి :

మణుగూరు ఆర్టీసీ డిపోకు చెందిన మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక మృతి పట్ల పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రవళిక భౌతిక ఖాయానికి పూలమాలవేసి, ఆత్మీయ నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఉన్న మహిళా కండక్టర్ మృతి అత్యంత బాధాకరమని, ఒక కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న మహిళను కోల్పోవడం ఆ కుటుంబానికి తీరనిలోటన్నారు. ఈ విషాద ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మానవతాదృక్పథంతో స్పందించి మృతురాలి కుటుంబానికి 10 లక్షలు ఎక్స్ గ్రేసియాతో పాటు ఆమె తల్లికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు అలాగే బ్యాంకు ద్వారా కోటి రూపాయలు ఇప్పించేలా తీసుకున్న నిర్ణయం తోపాటు ఆమె కుటుంబానికి అన్నీ విధాలుగా అండగా నిలవాలని ప్రభుత్వం ఆదేశించడం అభినందనీయమన్నారు. నివాళులర్పించిన వారిలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.





కొత్త నందికొండలో ఇందిరమ్మ ఇళ్ల
లబ్ధిదారులకు మార్కింగ్

- గ్రామాభివృద్ధి పనులపై అధికారుల పరిశీలన

అడవిదేవులపల్లి విశాలభారతి: కొత్త నందికొండ గ్రామపంచాయతీ పరిధిలో నూతనంగా గుడిసెల్లో నివాసముంటున్న వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడంతో, నూతన గృహాల నిర్మాణం కోసం అధికారులు స్థలాలను పరిశీలించి మార్కింగ్ ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మాణంలో ఉన్న వీవో (VO) భవనాన్ని పరిశీలించడంతో పాటు, భవనం సమీపంలో కమ్యూనిటీ మరుగుదొడ్ల నిర్మాణం కోసం అనువైన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఎల్‌నినో ప్రభావంపై గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే VBGRAMG పథకం ద్వారా గ్రామానికి అవసర మైన అభివృద్ధి పనులను గుర్తించి, వాటి ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. గ్రామ అవసరాలకు అనుగుణంగా చేపట్టాల్సిన పనులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏఎస్‌జే ఏవై హందాని, ఎంపీవో మోసిన్ బిన్ అహ్మద్, గ్రామ సర్పంచ్ రమావత్ మౌల ఉప సర్పంచ్ కుర్రా సుమన్ పంచాయతీ కార్యదర్శి శారద, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

మహిళలకు రక్షణ కల్పించలేని కాంగ్రెస్ సర్కార్.. ఇదేనా ప్రజాపాలన

- **పది రోజులైనా మహిళా ప్రొఫెసర్ ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేయరా?**
- **హోంశాఖ ముఖ్యమంత్రి చేతిలో ఉన్నా బాధితురాలికి న్యాయం శూన్యం!**
- **మహిళల భద్రతపై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిలదీసిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్**

మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:



మహిళల భద్రత విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, బాధిత మహిళలకు న్యాయం చేయలేని పాలన ఎందుకని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సత్యవతి రాథోడ్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మహిళా ప్రొఫెసర్ వేధింపులపై ఫిర్యాదు చేసి పది రోజులు గడుస్తున్నా కనీసం ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం కాంగ్రెస్ పాలనలో అధికార యంత్రాంగం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందో బయటపెడుతోందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా హోంశాఖ బాధ్యతలు నిర్వహిస్తున్నా మహిళలకు భద్రత, బాధితులకు న్యాయం అందకపోవడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె ప్రభుత్వ తీరును తీవ్రంగా ఎండగట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రత్యేక మహిళా భద్రత విభాగాన్ని ఏర్పాటు చేసి, మహిళలు ఎక్కడ ఉన్నా రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టామని గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై వేధింపులు, దాడులు, అత్యాచార ఘటనలు పెరుగుతున్నా ప్రభుత్వం కఠినంగా స్పందించడం లేదని ఆరోపించారు. మహిళలకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వమే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే బాధితులు ఎవరిని ఆశ్రయించాలని ప్రశ్నించారు.

పది రోజులుగా న్యాయం కోసం ఎదురుచూపులేనా?

హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న మహిళా ప్రొఫెసర్ తనపై జరుగుతున్న వేధింపులపై పది రోజుల క్రితమే మహిళా భద్రత విభాగానికి ఫిర్యాదు చేయడంతో పాటు గవర్నర్‌కు అధికారిక ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారని తెలిపారు. అయినా ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం, విచారణ కమిటీ ఏర్పాటు చేయకపోవడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా సమస్యను పరిష్కరించకుండా బాధితురాలినే బదిలీ చేయడం అన్యాయమని మండిపడ్డారు. ఫిర్యాదు అనంతరం బాధితురాలిని, ఆమె కుటుంబాన్ని భయపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై తక్షణమే విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

ఉన్నతాధికారులకే దిక్కులేకపోతే సామాన్య మహిళల పరిస్థితి ఏమిటి?

రిటైర్డ్ ఆర్మీ అధికారి కుమార్తెగా, ఉన్నత విద్యావంతురాలిగా అన్ని ఆధారాలతో ఫిర్యాదు చేసిన మహిళకే న్యాయం దక్కకపోతే మారుమూల గ్రామాల్లోని పేద, దళిత, గిరిజన మహిళలకు న్యాయం ఎవరు చేస్తారని సత్యవతి రాథోడ్ నిలదీశారు. బాధితుల ఫిర్యాదులను పట్టించుకోని పోలీసు వ్యవస్థ ఎవరి కోసం పనిచేస్తోందని ప్రశ్నించారు. మహిళల భద్రత విషయంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇప్పటివరకు చర్యలు ఎందుకు తీసుకోలేదని నిలదీశారు. ఈ ఘటనపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, స్వతంత్ర విచారణ కమిటీ ఏర్పాటు చేసి నిష్పక్షపాతంగా దర్యాప్తు జరపాలని, విచారణ పూర్తయ్యే వరకు ఆరోపణలు ఎదుర్కొంటున్న వీసీని బాధ్యతల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి, ఆమె కుటుంబానికి పూర్తి రక్షణ కల్పించాలని, విచారణలో నేరం రుజువైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన భూముల కేటాయింపులపై వస్తున్న ఆరోపణలపైనా ప్రభుత్వం మౌనం వీడాలని డిమాండ్ చేశారు. గతంలో వంద ఎకరాల భూమి ఇతర అవసరాలకు కేటాయించగా, మరో వంద ఎకరాల భూమిని హెచ్ఎండీఏకు అప్పగించే ప్రయత్నాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరారు. ఎన్నికల ముందు మహిళలను మహాలక్ష్ములుగా, మహారాణులుగా చేస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు మహిళలకు కనీస భద్రత కల్పించలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. మహిళలకు కావాల్సింది ఆర్భాటపు హామీలు కాదు.. భద్రత, గౌరవం, ఆత్మగౌరవం, తక్షణ న్యాయం అని స్పష్టం చేశారు.

న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు!

బాధిత మహిళకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ మహిళా విభాగం అండగా నిలుస్తుందని, ఈ వ్యవహారాన్ని పక్కదారి పట్టించేందుకు చేసే ప్రయత్నాలను సహించేది లేదని హెచ్చరించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు తెరిచి బాధితురాలికి న్యాయం చేయాలని, లేనిపక్షంలో మహిళల పక్షాన రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతమైన ఉద్యమం చేపడతామని సత్యవతి రాథోడ్ స్పష్టం చేశారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదులో అక్రమాలు, తహశీల్దార్‌కు బిఆర్ఎస్వి ఫిర్యాదు

- **నకిలీ పత్రాలతో అర్హత లేనివారి నమోదు,క్షుణ్ణంగా విచారించాలని డిమాండ్**
- **బిఆర్ఎస్వి మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు నలపరాజు రమేష్**



నారాయణపురం, విశాల భారతి: మునుగోడు నియోజకవర్గంలోని నారాయణపురం మండలంలో జరుగుతున్న ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు ప్రక్రియలో తీవ్ర అవకతవకలు జరుగుతున్నాయని బిఆర్ఎస్వి మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు నలపరాజు రమేష్ ఆరోపించారు. ఈ మేరకు బుధవారం నారాయణపురం మండల తహశీల్దార్ ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదులో అక్రమాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. కొందరు వ్యక్తులు ఎలాంటి అర్హత లేకపోయినప్పటికీ నకిలీ పత్రాలతో, తప్పుడు సమాచారంతో దరఖాస్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఎటువంటి సరైన విచారణ గానీ, పత్రాల ధృవీకరణ గానీ లేకుండానే అధికారులు ఈ దరఖాస్తులను విచ్చలవిడిగా ఆమోదిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన ఓటరు నమోదు ప్రక్రియలో ఇలాంటి మోసాలు జరగడం అత్యంత విచారకరమన్నారు. బిఆర్ఎస్వి ప్రధాన డిమాండ్లు, క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించి ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలి.అర్హత లేని, తప్పుడు పత్రాలు సమర్పించిన వారి దరఖాస్తులను తక్షణమే తిరస్కరించాలి.ఈ మోసాలకు, నిర్లక్ష్యానికి కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. నిజమైన, అర్హులైన ఓటర్లకు మాత్రమే ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరుతున్నామని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి నాయకులు అదేపు సురేష్ కుమార్, తిరుమలేష్, గంగాదేవి స్వామి, గవ్వల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసి రైతు వరి పంటను దౌర్జన్యంగా ట్రాక్టర్‌తో ధ్వంసం చేసిన గిరిజనేతరులు


- **ఆదివాసి పంటను నాశనం చేసిన వారిపై అట్రాసిటీ కేసు పెట్టాలి - ఆదివాసి నాయకులు డిమాండ్**



వాజేడు, విశాలభారతి: వాజేడు మండల పరిధి మొరుమూరు గ్రామపంచాయతీ అరుగుంటపల్లి G గ్రామ సరిహద్దు సర్వే నంబర్ 12/1, ఆదివాసి మహిళా రైతు మడకం సుగుణ తన పొలంలో వరి పంట వారంలో పంట చేతికి వస్తుంది అనుకునే లోపే పక్కనే తన పొలానికి అనుకోని వున్న కొప్పుల కృష్ణ, కొప్పుల మహేష్ అనే రిజనేతరులు వరి పొలాన్ని ట్రాక్టర్ తో రోటావేటర్ వేశారు.అది చూసిన రైతు ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వస్తుంది అనుకునే లోపే నేలపాడు చేశారని కన్నీరు మున్నీరై ఆ మహిళ రైతు కన్నీరు కారుస్తుంది. సమాచారం తెలుసుకున్న ANS ఆదివాసి నవనిర్మాణ సేనా నాయకులు అరుగుంటపల్లి G గ్రామ సరిహద్దు సర్వే నంబర్ 12/1 లో కి వెళ్లి పంటను పరిశీలించడం జరిగింది. ఈ ప్రాంతంలో 1/70 చట్టం అమలు లో ఉన్నప్పటికీ గిరిజనేతరులు అమాయక ఆదివాసీల పై దౌర్జన్యం పంటను నాశనం చేసినప్పటికీ ఆదివాసీల కోసం పనిచేయవలసిన అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారులు సొరవ తీసుకొని పంటను నాశనం చేసిన గిరిజనేతరులపై కఠినచర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ANS ఆదివాసి నవనిర్మాణ సేనా ములుగు జిల్లా అధ్యక్షులు ఎట్టి విద్యాసాగర్,ఆదివాసి నవనిర్మాణ సేనా రాష్ట్ర సోషల్ మీడియా ప్రతినిధి పాయం అజయ్, మండల కార్యదర్శులు తల్లాడి ప్రసాద్ ,యలం అశోక్ , నాయకు కోరం.మనోజ్ కుమార్ ,పీర్ల రాజు ,తల్లాడి నానబాబు, రైతులు మడకం ప్రకాశ్, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

రంగన్న ఆత్మీయ సమ్మేళనానికి యాచారం సర్పంచుల డుమ్మా!

- **ఎమ్మెల్యే తీరుపై సొంత పార్టీ నేతల్లోనే అసంతృప్తి?**
- **అభివృద్ధి పనుల్లో స్థానిక ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యమేది?**
- **గ్రామపంచాయతీల భాగస్వామ్యం లేకుండానే పనులా?**
- **'ఆత్మీయ సమ్మేళనం ఎవరి కోసం?' అంటూ నాయకుల ప్రశ్నలు**



విశాల భారతి, ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'రంగన్న ఆత్మీయ సమ్మేళనం'కు యాచారం మండలంలోని పలు గ్రామాల సర్పంచులు గైర్హాజరు కావడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. బొంగులూరు గేట్ సమీపంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు దూరంగా ఉండటంతో కాంగ్రెస్ శ్రేణుల్లో అంతర్గత అసంతృప్తిపై చర్చ మొదలైంది. పార్టీని బలోపేతం చేయాల్సిన ఆత్మీయ సమ్మేళనానికి సర్పంచులే హాజరుకాకపోవడం వెనుక కారణాలేమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం ఎక్కడ?

తెలంగాణ ప్రభుత్వం టీజీఐఐసీ, ఫ్యూచర్ సిటీ అభివృద్ధి నేపథ్యంలో యాచారం మండలానికి నిధులు మంజూరు చేసినప్పటికీ, పనుల విషయంలో స్థానిక సర్పంచులకు సమాచారం ఇవ్వడం లేదని కొందరు ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. గ్రామపంచాయతీ తీర్మానాలు, స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం లేకుండా అభివృద్ధి పనులు ఎలా చేపడతారని వారు ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఫార్మాసిటీ గ్రామాల్లో జరుగుతున్న పనుల్లోనూ ప్రజాప్రతినిధులకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కాంట్రాక్టర్‌తో కలిసి పనులు చేపడుతున్నారంటూ కొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే, ఈ ఆరోపణలపై ఎమ్మెల్యే వర్గం వివరణ తెలియాల్సి ఉంది. పార్టీ కార్యక్రమాలకు నాయకులు, కార్యకర్తలను ఆహ్వానించడం ఒక ఎత్తయితే, క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధులకు గౌరవం కల్పించి, అభివృద్ధి నిర్ణయాల్లో భాగస్వాములను చేయడం మరో ఎత్తు. స్థానిక నాయకత్వాన్ని విస్మరిస్తున్నారనే భావన బలపడితే అది పార్టీ ఐక్యతపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో యాచారం సర్పంచుల గైర్హాజరు సాధారణ పరిణామమా, లేక ఎమ్మెల్యే తీరుపై అసంతృప్తికి సంకేతమా అన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. ఈ అసంతృప్తిని పార్టీ నాయకత్వం ఎలా పరిష్కరిస్తుంది, అభివృద్ధి పనుల్లో స్థానిక ప్రజాప్రతినిధులకు తగిన ప్రాధాన్యం కల్పిస్తుందా అన్నది వేచి చూడాలి.

విద్యార్థుల విద్యా సామర్థ్యాలపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

- **స్పాట్ అసెస్‌మెంట్‌తో విద్యార్థుల అభ్యసన స్థాయిల పరిశీలన**
- **ఉపాధ్యాయులు బోధనా ప్రమాణాలు పెంచాలి**
- **తదుపరి తనిఖీ నాటికి విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపడాలి**
- **మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**



నెల్లికుదుర్ విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల మెరుగుదలే లక్ష్యంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. బుధవారం నెల్లికుదురు మండలంలోని నైనాల, పార్వతమ్మగూడెం గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విద్యాబోధన, విద్యార్థుల అభ్యసన స్థాయిలను స్వయంగా పరిశీలించారు. తనిఖీల్లో భాగంగా తరగతి గదులు, పాఠశాల పరిసరాలు, మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించడంతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ రెండో తరగతి నుంచి ఐదో తరగతి వరకు పిల్లల ప్రాథమిక భాషా, గణిత సామర్థ్యాలను ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) స్పాట్ అసెస్‌మెంట్ ద్వారా స్వయంగా పరీక్షించారు. చిత్రాలను చూపించి వాటి పేర్లు అడగడం, అంకెల ఆధారంగా ప్రశ్నలు వేయడం ద్వారా విద్యార్థుల అవగాహన స్థాయిని అంచనా వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఎఫ్ఎల్ఎన్ ద్వారా సబ్జెక్టుల వారీగా విద్యాబోధన అందిస్తూ పిల్లల్లో ప్రాథమిక నైపుణ్యాలను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఏడు ప్యానెల్ తనిఖీ బృందాలు తరచూ పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసి ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాయని వెల్లడించారు. ఇంగ్లీష్‌భాషా నైపుణ్యాల పెంపు కోసం లీఫ్ కార్యక్రమంతో పాటు ఎఫ్ఎల్ఎన్ అమలు చేస్తున్నామని, ప్రతి విద్యార్థి స్థాయిని ఉపాధ్యాయులు గుర్తించి వారికి అర్థమయ్యే రీతిలో బోధించాలని సూచించారు. తదుపరి తనిఖీ సమయానికి విద్యార్థులందరిలో స్పష్టమైన విద్యా పురోగతి కనిపించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం, వసతి గృహాల్లో కామన్ డైట్ మెనూ, ప్రతిభావంతులకు ప్రత్యేక తరగతులు అందిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యం, విద్య, పోషకాహారం, పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించడంతో పాటు పాఠశాలలు, వసతి గృహాల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును ఎఫ్ఆర్ఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో పర్యవేక్షిస్తూ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీజీ శ్రీరాములు, మండల విద్యాశాఖ అధికారి రాందాస్, ఏఏంఓ వెంకటేశ్వర్లు, ప్యానెల్ తనిఖీ సభ్యులు యాదగిరి, సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కస్తూరి గాంధీ బాలికల హాస్టల్‌లో అధ్వాన్న పరిస్థితులు

- **భోజనంలో పురుగులు, పడుకోవడానికి బెడ్లు కూడా లేవు,బాలికల అవస్థలు**
- **వెంటనే స్పందించి మౌలిక వసతులు కల్పించాలి**
- **బిఆర్ఎస్ నేత వెంకటస్వామి డిమాండ్**



చౌటుప్పల్,విశాలభారతి: మండలంలోని కస్తూరి గాంధీ బాలికల హాస్టల్ లో మౌలిక వసతులు లేక విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. హాస్టల్ లో ఉంటున్న బాలికలకు సరైన భోజనం అందించడం లేదని, అందిస్తున్న భోజనంలో పురుగులు వస్తున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. పడుకోవడానికి కనీసం బెడ్లు కూడా లేక బాలికలు నేలపైనే పడుకుంటున్నారని తెలిపారు. హాస్టల్ కు ఎలాంటి వసతులు లేక దయనీయ పరిస్థితి నెలకొందని విమర్శించారు. ఈ సందర్భంగా చౌటుప్పల్ మున్సిపల్ బిఆర్ఎస్ పార్టీ నాయకుడు గుండెబోయిన వెంకటస్వామి స్పందిస్తూ, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఈ ప్రాంతాన్ని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆయనకు మంత్రి పదవిపైనే శ్రద్ధ ఉందే తప్ప సొంత నియోజకవర్గంలోని పిల్లలు చదువుకుంటున్న హాస్టల్ పరిస్థితిపై లేదని విమర్శించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి వెంటనే హాస్టల్ ను సందర్శించి బాలికల గోడును స్వయంగా చూడాలని, వారికి మెరుగైన భోజనం, పడుకోవడానికి బెడ్లు, ఉండటానికి మంచి రూములు వంటి కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. బాలికల విద్య, భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- **కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి**



రాజేంద్రనగర్, విశాలభారతి : నార్సింగి మున్సిపల్ సర్కిల్ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బుధవారం నార్సింగి చౌరస్తాలో మున్సిపల్ కార్మికులను ఆయన కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. గతంలో గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో జైపాల్ రెడ్డి తమ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపి పరిష్కరించేవారని, ప్రస్తుతం ఆయన అందుబాటులో లేకపోవడంతో తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించేందుకు స్వయంగా ముందుకు రావాలని కోరారు. దీనిపై స్పందించిన జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్ (సూపర్‌వైజర్)కు నెల రోజులుగా జీతం అందక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తన దృష్టికి తీసుకురాగా, వెంటనే మున్సిపల్ అధికారులతో మాట్లాడి పెండింగ్‌లో ఉన్న ఒక నెల జీతం ఇప్పించినట్లు తెలిపారు. అదేవిధంగా కొన్ని రోజులుగా విధులకు దూరంగా ఉన్న వరప్రసాద్ అనే కార్మికుడిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని అధికారులతో ఫోన్‌లో మాట్లాడినట్లు వెల్లడించారు. సదరు కార్మికుడిని విధుల్లోకి తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉండాలని, తమ యూనియన్‌లో చేరి హక్కుల సాధనకు కలిసికట్టుగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. దీనికి స్పందించిన కార్మికులు తాము ఆయన వెంటే ఉంటామని హామీ ఇచ్చారు.

గంజాయి గ్యాంగ్ గుట్టురట్టు..

- **మరిపెడ పోలీసుల మెరుపుదాడి**
- **రూ.లక్ష విలువైన 2 కిలోల గంజాయి స్వాధీనం**
- **ముగ్గురు యువకులు అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు**
- **మరిపెడ కేంద్రంగా గంజాయి ప్యాకెట్ల తయారీకి రంగం సిద్ధం**

మరిపెడ విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్

గంజాయి అక్రమ వ్యాపారానికి పాల్పడుతూ యువత భవిష్యత్తును మత్తు మాయలోకి నెట్టే ప్రయత్నాలకు మరిపెడ పోలీసులు గట్టి అడ్డుకట్ట వేశారు. గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారుచేసి మార్కెట్లో విక్రయించేందుకు సిద్ధమైన ముగ్గురు యువకుల అక్రమ దందాను పోలీసులు ఛేదించారు. తొర్రూరు రోడ్డులోని డబుల్ బెడ్‌రూం సమీపంలో నిర్వహించిన తనిఖీల్లో రూ.లక్ష విలువైన 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు మరిపెడ సీఐ ఎల్. పవన్ కుమార్ వివరాలు వెల్లడించారు.



పోలీసులను చూసి పరుగు.. బ్యాగులో గంజాయి!

మరిపెడ ఎస్సై గంధ్రాతి సతీష్, పోలీసు సిబ్బంది హెచ్‌సీలు శ్రీనివాస్, రాజు, కానిస్టేబుళ్లు రవీందర్, రమేష్, వెంకన్నలతో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా తొర్రూరు రోడ్డులోని డబుల్ బెడ్‌రూం సమీపంలో ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులను గమనించిన వెంటనే అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. వారి వద్దనున్న బ్యాగును తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. దీంతో అక్రమ గంజాయి విక్రయాల వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

నాలుగు జిల్లాలే లక్ష్యం.. చిన్న ప్యాకెట్లలో విక్రయాలు!


పోలీసుల విచారణలో నిందితులు పవార్ విజయ్ (20), కంది అభిరామ్, బానోత్ మణిదీపక్‌గా గుర్తించారు. గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారుచేసి మరిపెడ, మహబూబాబాద్, సూర్యాపేట, ఖమ్మం ప్రాంతాల్లో విక్రయించేందుకు సిద్ధమైనట్లు వెల్లడైంది. గంజాయి విక్రయాల కోసం వినియోగించేందుకు సిద్ధం చేసుకున్నట్లు భావిస్తున్న మూడు సెల్‌ఫోన్లు, ఒక డిజిటల్ తూకం యంత్రంతో పాటు 2 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

గంజాయి సమాచారం ఇస్తే రూ.5 వేల నగదు బహుమతి!

గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, మత్తు పదార్థాల కార్యకలాపాలపై పోలీసులు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారని సీఐ ఎల్. పవన్ కుమార్ స్పష్టం చేశారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి సంబంధిత సమాచారం అందించే వారికి రూ.5 వేల నగదు బహుమతి అందజేస్తామని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ప్రకటించారు. మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణానికి ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. అక్రమ దందాకు అడ్డుకట్ట.. మత్తు ముఠాలకు హెచ్చరిక.. గంజాయి వ్యాపారంపై పోలీసుల నిఘా మరింత కఠినం!

నేలపట్ల ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థుల పట్ల వార్డెన్ దురుసు ప్రవర్తన

- **ఆర్డీఓ కు బిఆర్ఎస్వి వినతిపత్రం,వార్డెన్ ను సస్పెండ్ చేయాలని డిమాండ్**



చౌటుప్పల్,విశాల భారతి: మండలం నేలపట్ల గ్రామంలోని ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో విద్యార్థుల పట్ల వార్డెన్ దురుసుగా ప్రవర్తిస్తూ, అసభ్య పదజాలంతో దూషిస్తూ, బెదిరింపులు, దాడులకు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ భారత రాష్ట్ర విద్యార్థి విభాగం (బిఆర్ఎస్వి) నాయకులు చౌటుప్పల్ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్వినాయకులు మాట్లాడుతూ, హాస్టల్ వార్డెన్ సైదులు విద్యార్థుల పట్ల వ్యవహరిస్తున్న తీరు తీవ్ర ఆందోళన కలిగిస్తోందని అన్నారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్నారని, అలాంటి వారికి ప్రేమ, ఆప్యాయత, భద్రత కల్పించాల్సిన వార్డెన్, భయభ్రాంతులకు గురిచేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్ అనేది భద్రత కల్పించే నివాస స్థలం కావాలే కానీ భయంతో జీవించే పరిస్థితి ఉండకూడదని, దురుసు ప్రవర్తన, మానసిక వేధింపుల వల్ల విద్యార్థుల చదువు, మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. ఈ ఘటనను సాధారణ విషయంగా పరిగణించకుండా విద్యార్థుల నుంచి నేరుగా వివరాలు సేకరించి, సాక్ష్యాధారాలను పరిశీలించి నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న హాస్టల్ వార్డెన్ వీర ప్రకాష్ / సైదులును తక్షణమే సస్పెండ్ చేయాలి.ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.విద్యార్థులపై వేధింపులు, దాడులు జరగకుండా రక్షణ కల్పించాలి.హాస్టల్ లో భయం లేని, గౌరవప్రదమైన వాతావరణాన్ని కల్పించాలి. ఈ కార్యక్రమంలో బిఆర్ఆర్ఎస్వి మండల నాయకులు గంగాదేవి శివ, చౌటుప్పల్ మున్సిపల్ నాయకులు ఊదరి రాకేష్, ఎండీ అంతు, అశోక్, మీసాల సుమంత్, మేడకంటి విగ్నేష్, తన్నీరు నందివర్ధన్, దూడి గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదుకు బీఆర్ఎస్ నేతల చొరవ

- **ఇంద్రప్రస్థ కాలనీలో ఇంటింటా ప్రచారం**
- **అర్హులైన ప్రతి పట్టభద్రుడు నమోదు చేసుకోవాలి**



విశాల భారతి, ఎల్.బి.నగర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా ఇంద్రప్రస్థ కాలనీలో అర్హులైన పట్టభద్రులను కలిసి ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ పట్టభద్రులకు ఓటరు నమోదు ప్రాధాన్యతను వివరించి, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు. పట్టభద్రులు ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు బైరామల్‌గూడ డివిజన్ (హస్తినాపురం) అధ్యక్షుడు ఎరుకల మల్లేష్ గౌడ్ తెలిపారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరు నమోదును పూర్తి చేసుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎరుకల మల్లేష్ గౌడ్, గౌని వెంకటేష్ గౌడ్, కంది శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పోలీస్ అకాడమీలో కర్ణాటక ఇంటెలిజెన్స్ ఎస్పీతో ప్రత్యేక సమావేశం



రాజేంద్రనగర్, విశాల భారతి : కర్ణాటక రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం ఎస్పీ డెక్కా కిషోర్ బాబు ఐపీఎస్ బుధవారం ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీని సందర్శించారు. ఈ సందర్భంగా అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ ఐపీఎస్ అధ్యక్షతన ఏకశిల బ్లాక్‌లోని సమావేశ మందిరంలో ప్రత్యేక పరస్పర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ పోలీస్ అకాడమీలో అమలు చేస్తున్న ఆధునిక శిక్షణా విధానాలు, మౌలిక సదుపాయాలు, అకాడమీ అభివృద్ధి, వివిధ విభాగాల్లో అనుసరిస్తున్న ఉత్తమ పద్ధతులపై డైరెక్టర్ అభిలాష బిస్త్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్, డాక్యుమెంటరీ ద్వారా వివరించారు. ముఖ్యంగా 112 మంది ప్రొబేషనరీ డీఎస్పీలకు నిర్వహించిన భారీ ప్రవేశ శిక్షణ, శిక్షణా కార్యక్రమాలు, పాసింగ్ అవుట్ పరేడ్ విశేషాలను తెలియజేశారు. అనంతరం అకాడమీలోని వివిధ విభాగాల అధికారులు తమ శాఖల పనితీరు, శిక్షణా కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరించారు. వెల్ఫేర్ విభాగం పనితీరును డిప్యూటీ డైరెక్టర్ డి. మురళీధర్ ఐపీఎస్, పరిపాలన, వసతి సౌకర్యాలను కేఆర్‌కే ప్రసాద్, ఇన్‌సర్వీస్ కోర్సులను జి. కవిత, బహిరంగ శిక్షణా కార్యక్రమాలను అసిస్టెంట్ డైరెక్టర్ భరత్ వివరించారు. ప్రత్యేక శిక్షణా కోర్సులు, ఫోరెన్సిక్ విభాగం, మౌలిక సదుపాయాల గురించి డాక్టర్ ధనజ, వైద్య సేవలు, యూనిట్ మెడికల్ సెంటర్ పనితీరును డాక్టర్ రమాదేవి వివరించారు. ఈ సందర్భంగా కర్ణాటక రాష్ట్రంలో అనుసరిస్తున్న ఉత్తమ పోలీస్ శిక్షణా విధానాలు, తెలంగాణ పోలీస్ అకాడమీలో అమలు చేస్తున్న వినూత్న పద్ధతులపై అధికారులు పరస్పరం అభిప్రాయాలను పంచుకున్నారు. ఇరు రాష్ట్రాల పోలీస్ శిక్షణా సంస్థల మధ్య అనుభవాలు, విజ్ఞానం, ఉత్తమ విధానాల మార్పిడికి ఇటువంటి సమావేశాలు ఎంతగానో దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. సమావేశం అనంతరం అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ ఐపీఎస్, కర్ణాటక ఇంటెలిజెన్స్ ఎస్పీ డెక్కా కిషోర్ బాబుకు అకాడమీ తరఫున జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఆయన అకాడమీలోని వివిధ శిక్షణా విభాగాలు, క్రీడా సముదాయం, క్రీడాభవనం తదితర మౌలిక సదుపాయాలను సందర్శించి వాటి పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు డి. మురళీధర్ ఐపీఎస్, జి. కవిత, కేఆర్‌కే ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్లు శ్రీనివాసరెడ్డి, భరత్, యార్లగడ్డ రాంబాబు, వేముల శ్రీనివాసరావు, డాక్టర్ ధనజ, వైద్యాధికారి డాక్టర్ రమాదేవి, డీఎస్పీ శ్రీరాములు, ఇతర విభాగాల రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఓయూలో ఉద్యోగుల భారీ ర్యాలీ

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్.. మద్దతు తెలిపిన బిజెపి చీఫ్ రామచంద్రరావు
- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, వివిధ విద్యార్థి సంఘాల నేతలు.



ముషీరాబాద్,విశాల భారతి: ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బోధనేతర ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సుమారు 1,500 మంది ఉద్యోగులు భారీ ర్యాలీ నిర్వహించారు. బుధవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల నుంచి అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఉద్యోగుల ఆందోళనకు మద్దతుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, గాలి వినోద్‌కుమార్‌తో పాటు పలు విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2001-2004 మధ్య నియమితులైన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేయాలని, 2004 సెప్టెంబర్ తర్వాత నియమితులైన వారికి కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఎల్ఐసీ లింక్డ్ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు, అంతర్గత నోటిఫికేషన్ల ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని కోరారు.దశాబ్దాలుగా విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న రెగ్యులర్, టైమ్ స్కేల్, కాంట్రాక్టు ఉద్యోగుల హక్కులను పరిరక్షించాలన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం, విశ్వవిద్యాలయ అధికారులు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఉద్యోగస్తుల సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో ఈ అంశంపై గవర్నర్ ను కలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నేతలు ఖాదిర్, వెంకటేష్, నాగరాజా రావు, అక్బర్, పవన్ తో పాటు ఉద్యోగులు భారీగా పాల్గొన్నారు.

నల్ల రమేష్ యాదవ్ మృతికి సీపీఐ నేతల నివాళులు

- పార్థివ దేహంపై పూలమాలలు వేసి జోహార్లు అర్పించిన నాయకులు



విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ : అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, కుత్బుల్లాపూర్ మున్సిపాలిటీకి చెందిన నల్ల రమేష్ యాదవ్ అనారోగ్యంతో మృతి చెందడంతో సీపీఐ నాయకులు ఆయన పార్థివ దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతిపట్ల సంతాపం వ్యక్తం చేస్తూ జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కామ్రేడ్ ముత్యాల యాదిరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్, ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దాసరి ప్రసాద్, కుత్బుల్లాపూర్ శాఖ కార్యదర్శి పొన్నాల యాదగిరి, ధూపం నిరంజన్, రమేష్, రేణుక, లావణ్య, సంధ్యారాణి, ఎండీ ఈసాద్, శ్రీరాములు తదితర సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హైదరాబాద్ విద్యాశాఖలో నలుగురు ఉద్యోగులకు పదోన్నతులు



హైదరాబాద్: హైదరాబాద్ జిల్లా విద్యాశాఖలో ఆఫీస్ సబార్డినేట్ క్యాడర్‌లో విధులు నిర్వహిస్తున్న నలుగురు ఉద్యోగులకు జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌లో పదోన్నతులు లభించాయి. టీఎన్జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం. హుస్సైనీ ముజీబ్, హైదరాబాద్ అసోసియేట్ ప్రెసిడెంట్, స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ తెలంగాణ సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు కె.ఆర్. రాజ్‌కుమార్ ప్రత్యేక చొరవతో ఈ పదోన్నతులు సాధ్యమయ్యాయి. జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. యాదయ్య ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతులు పొందిన వారిలో అస్రా అజీజ్‌కు జీజీహెచ్ఎస్ మైసారం, సుజాతకు ఎంజీఎం హైస్కూల్ నాంపల్లి, అజీజ్ ఉర్ రెహమాన్‌కు ప్రభుత్వ ఉన్నత పాఠశాల చాదర్‌ఘాట్‌లో పోస్టింగ్‌లు కేటాయించారు. పోస్టు విలీనానికి సంబంధించి మనిశేఖర్‌ను జూనియర్ అసిస్టెంట్‌గా నియమించి జీజీహెచ్ఎస్ అంబర్‌పేటలో పోస్టింగ్ ఇచ్చారు. ఈ పదోన్నతుల ప్రక్రియలో ఫైళ్లను సమర్థవంతంగా ప్రాసెస్ చేసిన అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సూపరింటెండెంట్ జి. రాజ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్లు ఖాజా షోయబ్ అహ్మద్, ఫయాజ్, జంప్ శ్రీనివాస్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల పదోన్నతులకు విశేష కృషి చేసిన మారం జగదీశ్వర్, ఎస్.ఎం. హుస్సైనీ ముజీబ్‌లను కె.ఆర్. రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో శాలువాలు, భారీ పూలహారాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ వైస్ ప్రెసిడెంట్ ముజ్జాయిద్, పబ్లిక్ సెక్రటరీలు ఫిరోజ్ అహ్మద్, అరుణజ్యోతి, ఆర్గనైజింగ్ సెక్రటరీ శేఖర్, కల్చరల్ సెక్రటరీ అఖీల్, ఈసీ సభ్యులు, వివిధ యూనిట్ల నాయకులు, పదోన్నతులు పొందిన ఉద్యోగులు, పలువురు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

400 కుటుంబాల ఇక్కట్లు తీర్చాలి

- నెమలి నగర్ సమస్యలపై బీఆర్ఎస్ నేతల డిమాండ్

రాజేంద్రనగర్, విశాలభారతి :



నెమలి నగర్ పరిధిలో నెలకొన్న ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించి, స్థానిక ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) మణికొండ, నెక్నంపూర్ నాయకులు సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం నెమలి నగర్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప, 60 గజాల స్థలంలో నివసిస్తున్న సుమారు 400 కుటుంబాల సమస్యలను తెలుసుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల, ఆటస్థలం, బస్తీ దవాఖానా, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గత ఆరేళ్లకు పైగా ఆస్తుల మదింపు చేపట్టకపోవడం, ఇళ్లకు నంబర్లు కేటాయించకపోవడంతో మున్సిపల్ కార్పొరేషన్‌కు ఆదాయ నష్టం వాటిల్లుతోందన్నారు. వెంటనే ఆస్తుల మదింపు చేపట్టి ఇంటి నంబర్లు కేటాయించి పన్నుల వసూలు ప్రారంభించాలని కోరారు. ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు నుంచి నెమలి నగర్‌కు వెళ్లే రహదారి బిల్డర్ల నిర్మాణ పనుల కోసం భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో పూర్తిగా దెబ్బతిన్నదని తెలిపారు. దీంతో స్థానిక ప్రజలు, పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే రహదారికి మరమ్మతులు చేపట్టి, నష్టానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బస్తీ దవాఖానా, అంగన్‌వాడీ కేంద్రాలకు నీటి సరఫరా సౌకర్యం లేకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. బస్తీ దవాఖానాలో రాత్రి వేళల్లో భద్రత కోసం రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం 52 రకాల నిర్ధారణ పరీక్షలకు బదులుగా కేవలం 23 పరీక్షలే నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఎంబీబీఎస్ వైద్యుడు లేకపోవడం వల్ల వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందడం లేదని, వెంటనే వైద్యుడిని నియమించి అన్ని రకాల పరీక్షలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అదేవిధంగా సుమారు 90 మంది విద్యార్థులు తాత్కాలిక రేకుల షెడ్లలో విద్యనభ్యసించడం ఆందోళనకరమని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని శాశ్వత పక్కా పాఠశాల భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. పిల్లల ఆటస్థలం నిర్మాణ వ్యర్థాలతో నిండిపోయి నిరుపయోగంగా మారిందని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని విమర్శించారు. వెంటనే వ్యర్థాలను తొలగించి ఆటస్థలాన్ని పునరుద్ధరించి, నిరంతర నిర్వహణ చేపట్టాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు సరైన నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుతున్నాయని, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. స్థానికంగా రేషన్ దుకాణం లేకపోవడంతో నిత్యావసర సరుకుల కోసం నార్సింగి, పుప్పాలగూడ ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు నెమలి నగర్‌లోనే రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజలకు అవసరమైన తాగునీరు, రహదారులు, విద్య, వైద్యం, పారిశుధ్యం, సంక్షేమ సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ శాఖల బాధ్యత అని నాయకులు పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు అందాల్సిన కనీస సౌకర్యాల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సీతారాం ధూళిపాళ, గుట్టమీది నరేందర్, గోరుకంటి విఠల్, అందె లక్ష్మణ్ రావు, యాలాల కిరణ్, సుమనళిని, షేక్ ఆరిఫ్, షకీలా రెడ్డి, రాజేంద్ర ప్రసాద్, బాబు రావు తదితరులతో పాటు స్థానికులు అశోక్, శ్రీనివాసు, మల్లేష్, నగేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నింపిన 'రంగన్న ఆత్మీయ సమ్మేళనం

- సమ్మేళనానికి హాజరైన భువనగిరి ఎంపీ చామల కిరణ్
- కార్యకర్తలకు భరోసానిచ్చిన ఎంపీ చామల, ఎమ్మెల్యే మల్‌రెడ్డి
- పలుఅంశాలను నేతల ముందు ప్రస్తావించిన మండలస్థాయి నేతలు
- ముఖ్యమంత్రితో ప్రత్యేకంగా చర్చిస్తామని చెప్పిన ఎంపీ, ఎమ్మెల్యే



విశాలభారతి, ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి బుధవారం నిర్వహించిన 'రంగన్న ఆత్మీయ సమ్మేళనం' కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త జోష్ నింపింది. బొంగ్లూర్ క్రాస్ రోడ్డు వద్ద ప్రమీదా గార్డెన్స్‌లో జరిగిన ఈ సమ్మేళనానికి భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గారు, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి , కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు అభిషేక్‌రెడ్డితో పాటు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు వేలాదిగా తరలివచ్చారు. డప్పులు, డోళ్లతో ఈ సందర్భంగా మల్‌రెడ్డికి కార్యకర్తలు స్వాగతం పలికి, అభిమానాన్ని చాటుకున్నారు. ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ మండల, నియోజకవర్గస్థాయి నేతలు పలుఅంశాలను లేవనెత్తారు. మల్‌రెడ్డి రంగారెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను కొనియాడారు. మల్‌రెడ్డి గెలుపుతోనే ఇబ్రహీంపట్నం నియోజకవర్గ రూపురేఖలు మారిపోయాయని, కోట్లాది రూపాయల నిధులు గ్రామాలకు వస్తున్నట్లు చెప్పారు. నామినేటెడ్ పదవులు, పలు ఇతర అంశాలను రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఎంపీ, ఎమ్మెల్యేను కోరారు. ఇప్పుడిప్పుడే కుదురుకుంటున్నాం. ఏ నాయకుడు కూడా తన కార్యకర్తల కోసం ఆలోచించని రీతిలో మల్‌రెడ్డి చేపట్టిన ఆత్మీయ సమ్మేళనాన్ని ఎంపీ చామల అభినందించారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులు, అవినీతితో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందని ఈ పరిస్థితుల్లో పాలనాపగ్గాలు చేపట్టిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పుడిప్పుడే కుదురుకుంటుందని తెలిపారు. అవరోధాలున్నా ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చుతూ, అప్పుల భారం తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. ఈ క్రమంలోనే కార్యకర్తల్లో కొంతవరకు నైరాశ్యం ఉన్నట్లు పార్టీ గుర్తించినట్లు చెప్పారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో పదవుల అంశంపై ఎమ్మెల్యే మల్‌రెడ్డితో కలిసి, సీఎంతో చర్చిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఎల్‌నినో ప్రభావం ఇంకా మొదలుకాలేదని, ఇప్పటి నుంచే ప్రజలను అప్రమత్తం చేయాలని కార్యకర్తలకు ఆయన సూచించారు.

కార్యకర్తలే నా బలం, బలగం: మల్‌రెడ్డి రంగారెడ్డి.

కార్యకర్తలే నా బలం, బలగం అని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి గారు తెలిపారు. కష్టమొస్తే ఎంత దూరమైనా వచ్చేందుకు సిద్ధమని చెప్పారు. ప్రాధాన్యత మేరకు ఒక్కో కార్యక్రమం చేపడుతూ వస్తున్నామని చెప్పిన ఆయన ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను క్షేత్రస్థాయిలో ఎక్కడికక్కడ ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ప్రతీ కార్యకర్త సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండాలని చెప్పారు. పార్టీ గెలుపు కోసం ఐక్యంగా పనిచేయాలని చెప్పిన మల్‌రెడ్డి... కష్టపడి పనిచేసిన వారందరికీ తప్పకుండా గుర్తింపు లభిస్తుందని భరోసానిచ్చారు. రంగన్న ఆత్మీయ సమ్మేళనానికి ఊహించని రీతిలో వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలతో ప్రమీదా గార్డెన్స్ పరిసరాలు కిటకిటలాడాయి. అభిమాన నేతలతో ఫోటోలు దిగుతూ, సన్మాన కార్యక్రమాలతో సాయంత్రందాకా వేదిక సందడిగా కనిపించింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి, డిసిసిబి ఛైర్మన్ కొత్త కురుమ సత్తయ్య ఫ్రూట్ మార్కెట్ ఛైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, కౌన్సిలర్లు కోసిక ఐలయ్య, ధనరాజ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ వినియోగ మార్పులకు మోక్షమెప్పుడో?



- పెండింగ్ ప్రతిపాదనలకు ఆమోదం తెలపాలి.. హెచ్ఎండీఏ ఎండీకి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి వినతి

విశాల భారతి, ఎల్.బి.నగర్ :

ఎల్.బి.నగర్ నియోజకవర్గంలోని పలు కాలనీల్లో భూ వినియోగ మార్పులకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హెచ్ఎండీఏ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఓపెన్ స్పేస్, కన్జర్వేషన్, ఇండస్ట్రియల్, మాన్యుఫ్యాక్చరింగ్ జోన్లుగా ఉన్న భూములను నివాస ప్రాంతాలుగా మార్చేందుకు గతంలోనే ప్రతిపాదనలు, అవసరమైన పత్రాలు సమర్పించినా నిర్ణయం వెలువడలేదని తెలిపారు. ముఖ్యంగా ఇండస్ట్రియల్ జోన్ నుంచి రెసిడెన్షియల్ జోన్‌గా మార్పునకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభమై మూడేళ్లు గడిచినా ముందుకు సాగడం లేదని విమర్శించారు. బండ్లగూడ, ఫతుల్లాగూడ, కర్మన్‌ఘాట్, కొత్తపేట, లింగోజిగూడ, నాగోల్, హయత్‌నగర్, బాగ్ హయత్‌నగర్ ప్రాంతాల్లోని పలు కాలనీలకు సంబంధించి మొత్తం పది భూ వినియోగ మార్పు ప్రతిపాదనలకు ఆమోదం తెలపాలని కోరారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలపై త్వరగా నిర్ణయం తీసుకొని ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా బి.ఎన్. రెడ్డినగర్ డివిజన్‌లో పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు, పిల్లల ఆటస్థలాలు, కమ్యూనిటీ హాళ్ల అభివృద్ధికి పరిపాలనాపరమైన, ఆర్థిక అనుమతులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని కోరారు. సమస్యల పరిష్కారంలో జాప్యం కొనసాగితే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. హెచ్ఎండీఏ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్ సంబంధిత అంశాలను పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బి.ఎన్. రెడ్డినగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, వైదేహి నగర్ నార్త్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పోగుల రాంబాబు, కొత్త భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.

బియ్యం ధరలకు రెక్కలు.. సామాన్యుడి బతుకులకు చిల్లులు!

- కృత్రిమ కొరతపై నిఘా ఏదీ?.. అక్రమ నిల్వలపై కఠిన చర్యలు తీసుకోవాలి
- ప్రభుత్వం తక్షణమే స్పందించాలి: బొంగు వెంకటేష్ గౌడ్



విశాల భారతి, ఎల్ బి నగర్ : రాష్ట్రంలో బియ్యం ధరలు అమాంతం పెరుగుతుండటంతో సామాన్య ప్రజలు ఆందోళన చెందుతున్నారని బీసీ పీపుల్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొంగు వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో సతమతమవుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలపై బియ్యం ధరల పెరుగుదల అదనపు భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆకలి కొందరు వ్యాపారుల లాభాలకు మార్గం కాకూడదని, ధరల నియంత్రణపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. కరువు ప్రభావం స్పష్టంగా కనిపించకముందే బియ్యం ధరలు ఎందుకు పెరుగుతున్నాయని ఆయన ప్రశ్నించారు. మార్కెట్లో నిజంగానే బియ్యం కొరత ఉందా? లేక కొందరు వ్యాపారులు బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్న వారిని అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు ఉందన్నారు. రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి, ప్రభుత్వ కొనుగోళ్లు, గోదాముల్లో నిల్వలు, మిల్లర్ల వద్ద ఉన్న బియ్యం నిల్వలు, మార్కెట్లో సరఫరా పరిస్థితులపై అధికారులు సమగ్రంగా పరిశీలన జరపాలని కోరారు. అక్రమంగా నిల్వలు దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టిస్తూ అధిక ధరలకు విక్రయించే వ్యాపారులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధరల నియంత్రణ బాధ్యత ప్రభుత్వంపై, మార్కెట్ పర్యవేక్షణ బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని వెంకటేష్‌గౌడ్ స్పష్టం చేశారు. పౌర సరఫరాల శాఖ, తూనికలు-కొలతల శాఖ, సంబంధిత మార్కెట్ నియంత్రణ అధికారులు సమన్వయంతో విస్తృత తనిఖీలు నిర్వహించాలని సూచించారు. బియ్యం ధరల పెరుగుదలకు గల అసలు కారణాలను ప్రజలకు వెల్లడించి, ధరలు అదుపులోకి వచ్చేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

ద్విచక్ర వాహనం పైనుండి పడి మరణించిన వ్యక్తి

- మృతుడు ప్రభుత్వ ఉపాధ్యాయుడు



విశాల భారతి ఇబ్రహీంపట్నం : ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగర కలాన్ సర్వీస్ రోడ్లో ద్విచక్ర వాహనం నడుపుతూ ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోవడంతో తలకు బలమైన దెబ్బ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భూపతి ప్రేమ్ కుమార్ ఫిర్యాదు మేరకు తండ్రి భూపతి దాసు, ఉపాధ్యాయ వృత్తి. తుర్కయంజాల్ గ్రామం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా నివాసము ఉంటున్నాడు. స్వస్థలం గ్రామం నందివనపర్తి, యాచారం మండలం, రంగారెడ్డి జిల్లా. మృతుడు భూపతి దాసు, తండ్రి నర్సింహ, వయస్సు 50 సంవత్సరాలు, వృత్తి ప్రభుత్వ ఉపాధ్యాయుడు, వెల్దండ పాఠశాలలో పనిచేస్తున్నారు. తేదీ 03.11.2026 రాత్రి సుమారు 10:20 గంటలకు తన విధులు ముగించుకుని తుక్కుగూడ నుండి తుర్కయంజాల్‌కు తన రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ సైకిల్ నంబర్ TG07STR3279 పై సర్వీస్ రోడ్డు మార్గంలో ఇంటికి తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో కొంగరకలాన్ సర్వీస్ రోడ్డు వద్ద తన మోటార్ సైకిల్‌పై నియంత్రణ కోల్పోయి కింద పడిపోవడంతో, సర్వీస్ రోడ్డు కింద అపస్మారక స్థితిలో పడి ఉన్నారు. ఈ విషయాన్ని గమనించిన కొంతమంది వ్యక్తులు ఫిర్యాదుదారునికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే ఫిర్యాదుదారుడు సంఘటనా స్థలానికి చేరుకుని చూడగా, అప్పటికే తన తండ్రి మరణించినట్లు గుర్తించారు. అనంతరం పోలీసుల సహాయంతో మృతదేహాన్ని వైద్యం నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేశారు.

పంటలను పరిశీలించి రైతుల సమస్యలు తెలుసుకున్న సీపీఐ నేతలు

- రైతులకు అండగా నిలవాలి.. అందోజు రవీంద్ర చారి

విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ : రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలంలోని ఇప్పలపల్లి, వేములనర్వ గ్రామాల్లో సాగు చేస్తున్న మొక్కజొన్న, వరి పంటలను సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీపీఐ నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ అందోజు రవీంద్ర చారి పాల్గొని రైతులతో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పంటల పరిస్థితిని పరిశీలించి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. వ్యవసాయ రంగంలో రైతులకు అవసరమైన సహకారం అందించి, వారి ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, మాజీ జిల్లా కార్యదర్శి పుస్తకాల నర్సింగ్ రావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, ఒరుగంటి యాదయ్య, పి. పర్వతాలు, బుద్దుల జంగయ్య, కే. రామస్వామి, రైతు సంఘం నాయకులు మాధవరెడ్డి, ప్రభు లింగం, సర్పంచులు శీను నాయక్, నరసింహ, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





ఆమె ఒక మెరుపు.. ఒక పటాక

తెలుగందం శ్రీలీలను అద్భుతమైన అవకాశం వరించింది. సూపర్‌స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా, అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో నటలోకనాయకుడు కమల్‌హాసన్, ఆర్.మహేంద్రన్ కలిసి నిర్మిస్తున్న 'ధర్మన్' సినిమాలో ఆమె కీలకపాత్ర పోషిస్తున్నది. గత కొన్ని రోజులుగా 'ధర్మన్'లో శ్రీలీల నటిస్తున్నట్టు సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయి. ఇప్పుడు ఈ విషయాన్ని అధికారికంగా చిత్రబృందం ధృవీకరించింది. ఈ సందర్భంగా శ్రీలీలకు స్వాగతం పలుకుతూ, ఈ సినిమాలోని ఆమె పాత్రను పరిచయం చేస్తూ ఓ గ్లింప్స్‌ని బుధవారం మేకర్స్ విడుదల చేశారు. ఈ గ్లింప్స్‌లో శ్రీలీల ఆకట్టుకునే అవతారంలో కనిపించి, సినిమాపై ఆసక్తిని పెంచారు. అనిరుధ్ రవిచందర్ అందించిన క్లాసికల్ మ్యూజిక్ ఆమె పరిచయ సన్నివేశాలకు మరింత అందాన్ని తెచ్చింది. అనే క్యాప్షన్ శ్రీలీల పాత్ర సినిమాలో ఎంత సందడి చేయనున్నదో తెలియజేస్తున్నది. డెడ్లీ డాక్టర్‌గా మిస్టీరియస్ పాత్రలో రజనీకాంత్ నటిస్తున్న ఈచిత్రంలో నయనతార కథానాయిక. ఈ చిత్రానికి కెమెరా: నికేత్ బొమ్మి.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.